


www.vibharenews.com

# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL    ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి    మంగళవారం 01 జూన్ 2021    సంపుటి : 02    సంచిక :315    పేజీలు : 4    వెల : రూ 3-00


## ఏపీలో జూన్ 10 వరకు కర్ఫ్యూ పొడిగింపు

అమరావతి: ఏపీలో జూన్ 10 వరకు కర్ఫ్యూ పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. కర్ఫ్యూ వేళల్లో ఎలాంటి మార్పులు లేవని ప్రభుత్వం తెలిపింది. ఉదయం 6 గంటల నుంచి మ.12 గంటల వరకు సడలింపు యథాతథంగా కొనసాగుతుంది.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో కోవిడ్‌పై సమీక్ష చేపట్టారు. ఏపీలో నేటితో కర్ఫ్యూ ఆంక్షలు ముగియడంతో జూన్ 10 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

### కోవిడ్, బ్లాక్ ఫంగస్, ఆక్సిజన్ సరఫరాపై

# సీఎం జగన్ సమీక్ష



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా వైరస్, బ్లాక్‌ఫంగస్, బాధితులకు అందుతున్న వైద్యం, ఆక్సిజన్ సరఫరా, నిల్వలపైన సోమవారం సమీక్ష నిర్వహించారు. కరోనా వైరస్‌పై ముఖ్యమంత్రి సమీక్ష సందర్భంగా.. రాష్ట్రంలో కోవిడ్ పరిస్థితులను అధికారులు సీఎంకు వివరించారు. అర్బన్‌లో ప్రతి పదిలక్షల జనాభాకు కేసులు 2632.. రూరల్‌లో ప్రతి పదిలక్షల జనాభాకు కేసులు 1859 ఉన్నాయని అధికారులు తెలిపారు. పాజిటివిటీ రేటు గణనీయంగా తగ్గిందని, మే 16న పాజిటివిట్ రేటు 25.56 శాతం ఉండగా, మే 30 నాటికి 15.91 శాతంగా నమోదైందని వెల్లడించారు. అలాగే 2 లక్షలకుపైగా ఉన్న యాక్టివ్ కేసులు 1.6 లక్షలకు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. రికవరీ రేటుకూడా గణనీయంగా మెరుగుపడిందని, మే 7న 84.32శాతంగా ఉన్న రికవరీ రేటు, ప్రస్తుతం దాదాపు 90శాతానికి చేరిందని వెల్లడించారు. మే 3న 19,175 కాల్స్ 104కు రాగా, మే 29న 3,803 కాల్స్ నమోదయ్యాయని, కేసుల సంఖ్య తగ్గిందనడానికి ఇదొక సంకేతమని అన్నారు. అన్ని జిల్లాల్లో కూడా కేసులు తగ్గుముఖం పట్టాయని అధికారులు తెలిపారు. బ్లాక్‌ఫంగస్, బాధితులకు అందుతున్న వైద్యంపై సీఎం సమీక్షప్రస్తుతం రాష్ట్రంలో 1179 బ్లాక్ ఫంగస్ కేసులు ఉన్నాయని, ఇందులో 1068 మందికి వైద్యం అందుతోందని, 97 మందికి నయం అయ్యిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. 14 మంది మరణించారని, కోవిడ్ లేకున్నా.. బ్లాక్ ఫంగస్ వస్తుందన్న విషయం తమ పరిశీలనలో తేలిందని వెల్లడించారు. బ్లాక్ ఫంగస్ వచ్చిన వారిలో 1139 మంది కోవిడ్ సోకినవారు కాగా, 40 మందికి కోవిడ్‌రాకపోయినా బ్లాక్ ఫంగస్ వచ్చిందన్నారు. డయాబెటిస్ ఉన్నవారికి అధికంగా వస్తోందని తెలిపారు. బ్లాక్ ఫంగస్ సోకిన వారికి అవసరమైన ఇంజక్షన్లు, మాత్రలు అందుబాటులోకి తెచ్చుకునేలా ప్రయత్నాలు చేయాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. కేంద్రం కేటాయింపులు ప్రకారవే ఇంజక్షన్లు వస్తున్నాయని, మాత్రలను అవసరమైనంత మేర సిద్ధంచేసుకుం టున్నామని, అలాగే ప్రత్యామ్నాయ ఇంజక్షన్లుకోసం కూడా కృషిచేస్తున్నామని అధికారులు తెలిపారు. ఆక్సిజన్ వినియోగం 490 టన్నులకు తగ్గిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. 29న 654 టన్నులను సేకరించామని, స్థానికంగా 230 టన్నుల ఉత్పత్తి ఉందని వెల్లడించారు. వినియోగం ఆస్థాయికి వచ్చేంతవరకూ కూడా అధికారులు ఆక్సిజన్ సేకరణ, నిల్వలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ నిల్వచేసే ట్యాంకులు ఉండాలని సీఎం ఆదేశించారు. కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన 92 మంది పిల్లలను ఇప్పటివరకూ గుర్తించామని, వీరిలో 43 మందికి రూ.10 లక్షల చొప్పున డిపాజిట్ చేశామని అధికారులు వెల్లడించారు.

## 'ఆ తర్వాతే ఆనందయ్య మందుల పంపిణీ

**వివరాలు వెల్లడించిన ఆయుష్ కమిషనర్ రాములు**

విజయవాడ: ఆనందయ్య, నెల్లూరు జిల్లా కలెక్టర్లతో మాట్లాడిన తర్వాతే మందుల పంపిణీపై నిర్ణయం తీసుకుంటామని ఏపీ ఆయుష్ కమిషనర్ రాములు తెలిపారు. ఆనందయ్య మొత్తం ఐదు రకాల మందులు తయారు చేశాడని, ఇందులో ్రా, ూ, ఖీ, ఐ డ్రాప్స్ శాంపిల్స్ ను సేకరించి ల్యాబ్‌కి పంపామన్నారు. ఈ మందుల పనితీరు పరిశీలించే క్రమంలో సెంట్రల్ ఆయుష్ రీసెర్చ్ సెంటర్ సహాయం కూడా తీసుకున్నామని ఆయన వెల్లడించారు. ఆనందయ్య మందుల్లో ్రా, ూ, ఖీ రకం మందు వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేనందువల్ల వినియోగానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఆయుష్ కమిషనర్ రాములు తెలిపారు. ఇక ఆనందయ్య మందుల్లో బాగా ఫేమస్ అయిన ఐ డ్రాప్స్ వల్ల ఎటువంటి హాని జరగదు అనేందుకు ఇంకా పూర్తి స్థాయి ఆధారాలు లభించలేదని ఆయన వెల్లడించారు. అందుకే ఐ డ్రాప్స్ వినియోగించడంపై నిర్ణయాన్ని వాయిదా వేసినట్టు వివరించారు. కె రకం మందు శాంపిల్స్‌ని తాము పరిశీలించలేదని ఆయన చెప్పారు. ఇదే విషయాలని హైకోర్టు దృష్టికి కూడా తీసుకొచ్చామని ఆయన వివరించారు. ఆనందయ్య తయారు చేస్తున్న మందులు ఆయుర్వేద మందులు కాదని స్పష్టం చేశారు ఆయుష్ కమిషనర్. ఈ మందుల వల్ల కొవిడ్ తగ్గుతుందని ఎక్కడా నిర్ధారణ కాలేదన్నారు. ప్రస్తుతం కరోనాకు చికిత్స పొందుతున్న రోగులు, వైద్యులు సూచించిన ఔషధాలు వాడుతూ ఆనందయ్య మందును అదనంగా వాడటంలో ఇబ్బందులు లేవన్నారు.

## ఏపీ డీజీపీ ట్విటర్ నకిలీ అకౌంట్ తొలగింపు

అమరావతి: డీజీపీ డి.గౌతమ్ సవాంగ్ అధికారిక ట్విటర్ అకౌంట్‌ను పోలిన నకిలీ అకౌంట్‌ను సృష్టించిన ఆగంతకుడు అందర్నీ బురిడీ కొట్టించే ప్రయత్నం చేశాడు. ఇది 'డీజీపీ అంధ్రప్రదేశ్‌వ అధికారిక అకౌంట్ అంటూ అపరిచితుడు చేసిన ట్వీట్‌తో అనుమానించిన డీజీపీ కార్యాలయం ఆరా తీస్తే అది నకిలీ అకౌంట్ అని బయటపడింది. వెంటనే రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు, ఏపీ పోలీస్ టెక్ సర్వీసెస్ అధికారులు 'డీజీపీ ఆంధ్రప్రదేశ్ ః ఏపీస్టేట్‌డీజీపీవ పేరుతో ఉన్న నకిలీ అకౌంట్‌ను బ్లాక్‌చేసి దాన్ని వినియోగించే అవకాశం లేకుండా తొలగించారు.



# 14 మెడికల్ కాలేజీల నిర్మాణానికి సీఎం జగన్ శంకుస్థాపన



**నాడు-నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు మారుస్తున్నాం**

**ప్రతి పార్లమెంట్ పరిధిలోనూ మెడికల్ కాలేజీ ఏర్పాటు**

**రెండేళ్లలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా రూ.5,215 కోట్లు చెల్లించాం**

**శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 14 వైద్య కళాశాలల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా పిడుగురాళ్ల, మచిలీపట్నం, విజయనగరం, అనకాపల్లి, రాజమండ్రి, అమలాపురం, పాలకొల్లు, ఏలూరు, బాపట్ల, మార్కాపురం, మదనపల్లె, పెనుకొండ, నంద్యాల, ఆదోనిలో ఏర్పాటు చేయనున్న కాలేజీలకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ, ఈ రోజు మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. పేదవారికి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి పార్లమెంట్ పరిధిలోనూ టీచింగ్ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నామని, మెడికల్ కాలేజీలకు అనుబంధంగా నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 16 కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పులివెందుల, పాడేరులో మెడికల్ కాలేజీల పనులు జరుగుతున్నాయని.. కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణాలను మూడేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. "మెడికల్ కాలేజీల నిర్మాణాలకు దాదాపు రూ.8వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. పేదవారికి మంచి వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నాం. పిడుగురాళ్ల, మచిలీపట్నం, విజయనగరం, అనకాపల్లి, రాజమండ్రి, అమలాపురం, పాలకొల్లు, ఏలూరు, బాపట్ల, మార్కాపురం, మదనపల్లి, పెనుకొండ, నంద్యాల, ఆదోని, పాడేరు, పులివెందులలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నామనివవ సీఎం తెలిపారు. "మెడికల్ కాలేజీలతోపాటు 500 పడకల ఆస్పత్రులు కూడా ఏర్పాటు చేస్తున్నాం. అత్యాధునిక వసతులతో వైద్య కళాశాలల నిర్మాణం చేపడుతున్నాం. నాడు-నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు మారుస్తున్నాం. ఎన్‌ఏబీహెచ్ అక్రిడేషన్ పొందేలా అడుగులు ముందుకేస్తున్నాం. మూడేళ్లలో రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టే ప్రైవేట్ ఆస్పత్రులకు జిల్లా కేంద్రాలు, కార్పొరేషన్లలో 5 ఎకరాల భూమి ఉచితంగా కేటాయిస్తాం. ప్రతి గ్రామంలోనూ వైఎస్‌ఆర్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి మండలానికి రెండు పీహెచ్‌సీలను తీసుకొస్తున్నాం. రూ.246 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో 5 మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నాం. వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో గణనీయమైన మార్పులు చేశాం. 2,436 చికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చాం. వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపు చేశామని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.3వేల నుంచి రూ.10వేలకు పెన్షన్ అందిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. కోవిడ్ వైద్యాన్ని కూడా ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చామన్నారు. బ్లాక్ ఫంగస్ వైద్యాన్ని కూడా ఆరోగ్యశ్రీ పరిధిలో చేర్చామని.. రెండేళ్లలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా రూ.5,215 కోట్లు చెల్లించామని సీఎం జగన్ తెలిపారు. 1180 వాహనాలు 108, 104లను అందుబాటులోకి తీసుకొచ్చామని సీఎం జగన్ తెలిపారు.

## ఆనందయ్య మందుకు

# ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**అనుమతి ఇచ్చిన ఏపీ ప్రభుత్వం**

**పీ,ఎల్, ఎఫ్ రకం మందులకు అనుమతి**

**కంట్లో చుక్కల మందుకు దక్కని పర్మిషన్**

**సీసీఆర్ఏఎస్ నివేదిక ఆధారంగా ప్రభుత్వ నిర్ణయం**



అమరావతి: ఎట్టకేలకు ఆనందయ్య మందుకు అడ్డంకులు తొలగిపోయాయి. కరోనా రోగులకు ఆనందయ్య మందు ఇవ్వవచ్చంటూ ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సీసీఆర్ఏఎస్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆనందయ్య ఇచ్చే పీ, ఎల్, ఎఫ్ మందులను రోగులు వాడేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని ఏపీ ప్రభుత్వం తేల్చి చెప్పింది. అయితే కంట్లో వేసే 'కేవ రకం మందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. కే మందుకు సంబంధించి విచారణ రిపోర్టు రానందున, ప్రస్తుతం ఈ మందుకు అనుమతి ఇచ్చేందుకు నిరాకరించింది. కంట్లో వేసే చుక్కల మందుకు సంబంధించి నివేదిక రావడానికి మరో రెండు నుంచి మూడు వారాల సమయం పట్టే అవకాశం ఉంది. ఆ నివేదిక పరిశీలించిన అనంతరం కే రకం మందుపై నిర్ణయం తీసుకోనున్నారు. కరోనాకు డాక్టర్లు ఇచ్చిన మందులు వాడుతూనే.. వ్యక్తిగత విచక్షణ మేరకు ఆనందయ్య మందును వాడుకునేందుకు ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చింది. ఆనందయ్య మందులు వాడుతున్నామనే కారణంతో మిగిలిన మందులు ఆపవద్దంటూ ప్రజలకు ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అయితే అనందయ్య మందు వాడితే కరోనా తగ్గుతుందనేందుకు కచ్చితమైన ఆధారాలు ఏవీ లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఆనందయ్య మందుల వల్ల హాని కూడా లేదని తేలింది. ఆనందయ్య మందును తీసుకునేందుకు కొవిడ్ రోగులు కృష్ణపట్నం రావొద్దని ప్రభుత్వం సూచించింది. రోగుల బదులు వారి కుటుంబ సభ్యులు వచ్చి మందును తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేసింది. ఇలా చేయడం వల్ల కరోనా వ్యాప్తిని నివారించవచ్చని సూచించింది. ఆనందయ్య మందు పంపిణీలో కోవిడ్ ప్రోటోకాల్ పాటించాలంటూ ఆదేశించింది.

## ఏపీలో ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీకి చెక్

**రోగుల నగదు చెల్లింపులు నోడల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జరగాలి**


**ఏపి హైకోర్టుకీలక ఆదేశాలు**



అమరావతి మే 31 కరోనా వైరస్ మహమ్మారి విజృంభణ సమయంలో కూడా కాసుల కోసం కక్కుర్తి పడుతూ వైద్య వృత్తికే కళంకం తెచ్చేలా కొన్ని ఆస్పత్రులు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం సామాన్యులు ఎంతగా విన్నపం చేస్తున్నా కూడా ఏ మాత్రం మానవత్వం అనేది లేకుండా ఆస్పత్రి వర్గాలు ఫీజులు దండుకుంటున్నాయి. ఈ తరహా ఘటనలు ఇప్పటికే ఎన్నో వెలుగులోకి వచ్చాయి. ఈ విషయంపై అఖిల భారత న్యాయవాదుల సంఘం దాఖలు చేసిన పిల్ పై ఏపీ హైకోర్టు ఆదేశాలు కీలక ఆదేశాలు ఇచ్చింది. హైకోర్టు ఆదేశాలతో కోవిడ్ నోడల్ ఆఫీసర్ విధులు నిర్ధారించింది ఏపీ వైద్య ఆరోగ్య శాఖ. రోగుల నగదు చెల్లింపులు నోడల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జరగాలని హైకోర్టు సూచించిం ది. కరోనా రోగులకు బిల్లులు ఇచ్చే ముందుగా నోడల్ ఆఫీసర్ సంతకం చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం బిల్లులు ఇచ్చారా లేదా పరిశీలించాలని తెలిపింది. అలాగే నోడల్ అధికారి సంతకం లేకుండా కోవిడ్ ఆసుపత్రులు నగదు తీసుకోకూడదని హైకోర్టు తేల్చి చెప్పింది. ప్రతి కోవిడ్ ఆసుపత్రిలో చికిత్స నగదుకు సంబంధించి డిస్ ప్లే బోర్డ్స్ ఏర్పాటు చేయాలని సూచించింది. హైకోర్టు ఆదేశాలు అమలు జరిగిలా జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ డీఎంహెచ్ ఓ లను హైకోర్టు ఆదేశించింది. ఏపీ హైకోర్టు సూచనల మేరకు ఏపీ ప్రభుత్వ కీలక ఆదేశాలు జారీ చేసింది. అఖిక భారత న్యాయవాదుల సంఘం దాఖలు చేసిన పిల్ పై విచారణలో హైకోర్టు కీలక సూచనలు చేసింది. దీనిపై ఆదేశాలు ఇచ్చింది ప్రభుత్వం.

## ఏపీలో కొత్తగా 7,943 కరోనా కేసులు

అమరావతి: గత 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్‌లో 83,461 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 7,943 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. నిన్న ఒక్కరోజే కరోనా బారిన పడి 98 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 10,930కు చేరింది. గడిచిన 24 గంటల్లో 19,845 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 15 లక్షల 28 వేల 360 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఏపీలో ఇప్పటివరకు 1,92,56,304 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆదివారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ఏపీలో ప్రస్తుతం 1,53,795 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రాష్ట్రంలో నేటి వరకు 1,92,56,304 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గత 24 గంటల్లో జిల్లాల వారీగా నమోదైన కరోనా కేసుల వివరాలు.. శ్రీకాకుళం- 231, విజయనగరం- 271, విశాఖ- 551, తూ.గో- 1877, ప.గో- 461, కృష్ణా- 291, గుంటూరు- 765, ప్రకాశం- 345, నెల్లూరు- 378, చిత్తూరు- 1283, అనంతపురం- 544, కర్నూలు- 499, వైఎస్ఆర్ జిల్లా- 447 కేసులు నమోదయ్యాయి.




## 14 మెడికల్ కాలేజీలు.. దేశంలోనే ప్రథమం: సింఘాల్

**ఏపీలో కరోనా కేసులు తగ్గుతున్నాయి**

**ఆక్సిజన్ వినియోగం తగ్గింది**

**కరోనా రాకుండానే బ్లాక్ ఫంగస్ సోకిన వారు 40మంది**

విజయవాడ: ఒకే సారి 14 మెడికల్ కాలేజీలకు శంఖుస్థాపన చేయడం దేశంలో ఇదే ప్రథమం అని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కరోనా కట్టడి కోసం రాష్ట్రంలో విధించిన కర్ఫ్యూని జూన్ 10 వరకు పొడిగించాం. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 వరకు సడలింపులు యధావిధిగా ఉంటాయివవ అన్నారు. "రాష్ట్రంలో కోవిడ్ కేసులు బాగా తగ్గాయి. గడిచిన 24 గంటలలో 83, 461 శాంపిల్స్ పరీక్షించాం. 7,943 పాజిటివ్ కేసులు నమోదు కాగా.. 98 మంది కోవిడ్ బారిన పడి మృతి చెందారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఐసీయూ బెడ్స్- 1,461, ఆక్సిజన్ బెడ్స్ 6,323 అందుబాటులో ఉన్నాయి. కోవిడ్ కేర్ సెంటర్లో 15,106 వేలమంది చికిత్స పొందుతున్నారు. జిల్లాల్లో రెమిడెసివర్ ఇంజక్షన్లు 1,75,000 డోసులు జిల్లాలలో అందుబాటులో ఉన్నాయి. ఈ రోజు ఆక్సిజన్ 591 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ వినియోగించాం. గతంతో పోలిస్తే ఆక్సిజన్ వినియోగం కూడా బాగా తగ్గింది. 104 కాల్ సెంటర్ కి వచ్చే కాల్స్ సంఖ్య తగ్గిందివవ అన్నారు. "రాష్ట్రంలో ఇప్పటి వరకు బ్లాక్ ఫంగస్ కేసులు1179 నమోదవ్వగా.. ఇందులో 14 మంది ఇప్పటివరకు మృతి చెందారు. 97 మంది ట్రీట్ మెంట్ పొంది కోలుకున్నారు. ఇక బ్లాక్ ఫంగస్ సోకిన వారిలో 1139 మందికి కోవిడ్ వచ్చిన వారు ఉన్నారు. మరో 40 మందికి కరోనా రాకుండానే బ్లాక్ ఫంగస్ వచ్చింది. బ్లాక్ ఫంగస్ సోకిన వారిలో కోవిడ్ సమయంలో ఆక్సిజన్ ఉపయోగించిన వారు 370 అయితే ఆక్సిజన్ ఉపయోగించని వారు- 809 కాగా.. 687 మంది స్టెరాయిడ్స్ ఉపయోగిస్తే, 492 మంది స్టెరాయిడ్స్ ఉపయోగించలేదు. ఇక బ్లాక్ ఫంగస్ సోకిన వారిలో 743 మంది డయాబెటిస్ పేషేంట్స్ ఉన్నారు. బ్లాక్ ఫంగస్‌కి అవసరమైన మందులు కేంద్రం కేటాయిస్తోందివవ అని తెలిపారు.

# సంపాదకీయం

మంగళవారం 01 జూన్ 2021

## ఆధునిక వైద్యానికి ప్రత్యామ్నాయం లేదా..

ప్రపంచంలో ఉన్న వైద్యాలన్నింటినీ అధ్యయనం చేసి వడకట్టినదే గదా 'ఆధునిక వైద్యం'. ఇంకా అనేక అధ్యయనాలు చేయాలి. కొత్త జబ్బులు విసిరే సవాళ్లు ఎప్పుడూ వుంటూనే వుంటాయి. చరకుడు రాసిన 'చరక సంహిత', శుశ్రూతుడు రాసిన 'శుశ్రూత సంహిత' లనూ, ఆయుర్వేద, సిద్ధ, యునానీ మందుల మీద 'ప్రభుత్వం ఆధ్వర్యంలో' మరింత పరిశోధనలు జరగాలి.రాన్రానూ ఇంగ్లీషు వైద్యం ఖరీదైపోతున్నది. అందుకే ఆయుర్వేద, సిద్ధ, యునానీ, హోమియో, ఎలక్ట్రో హోమియో, రేకీ, నాటు వైద్యం వంటి పేర్లతో నడుస్తున్న వైద్యాలను ప్రోత్సహించక తప్పదనే వాదం బలంగా వినబడుతున్నది.చరకుడు రాసిన 'చరక సంహిత', శుశ్రూతుడు రాసిన 'శుశ్రూత సంహిత' లనూ, ఆయుర్వేద, సిద్ధ, యునానీ మందుల మీద 'ప్రభుత్వం ఆధ్వర్యంలో' మరింత పరిశోధనలు జరగాలి.ముక్కు తెగిపోయిన వారికి మళ్ళీ ముక్కును అమర్చే ప్లాస్టిక్ సర్జరీ చేస్తుంటారు. క్రీస్తు పూర్వం మన దేశంలో 'శుశ్రూతుడు' చేసిన ఈ శస్త్రచికిత్స 'ఇండియన్ ఫోర్‌హెడ్ రినోప్లాస్టీ'గా ప్రపంచమంతటా ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉంది. ఇంగ్లీషు వైద్యం లేదా అల్లోపతీ అనే దాన్ని ఒక వైద్య విధానంగానూ, మిగతావన్నీ ప్రత్యామ్నాయ వైద్య విధానాలనీ పిలుచుకోవాలా ? 500 సంవత్సరాల క్రితం వరకు మానవుడి శరీర నిర్మాణం ఎలా ఉంటుందో ఎవరికీ తెలీదు. మృతదేహాలను కోసి చూసిన తరువాతే 'దేహనిర్మాణ శాస్త్రం (ఎనాటమీ)' మనకు అర్థం అయింది. దాని తర్వాత అనేక పరిశోధనల అనంతరం 'దేహ ధర్మాలైన జీర్ణక్రియ, శ్వాసక్రియ, మెదడు-గుండెల పని తీరు వగైరాలన్నీ (ఫిజియాలజీ)' అర్థం అయ్యాయి.కాలక్రమేణా పరిశోధనలు మరింతగా ముందుకు సాగి, రోగాల సమయంలో శరీరంలో ఏయే మార్పులు వస్తుంటాయో కూడా (పేథాలజీ) తెలిశాయి.గాలిలో సూక్ష్మ జీవులు ఉన్నాయని తెలిసింది 160 సంవత్సరాల క్రితమే. వాటి ద్వారా వచ్చే జబ్బులు, రాకుండా ఏం చేయాలో, వస్తే ఏం చేయాలో తెలిసింది ఆ తర్వాతే (మైక్రోబయాలజీ).వందేళ్ళ క్రితం వరకూ యాంటీబయాటిక్స్ అనే మందులే లేవు. మొట్ట మొదటి యాంటీబయాటిక్ 'పెన్సిలిన్' ను 1942లో ఉపయోగించారు. ఇప్పుడు మనం వాడే మందులన్నీ ఆ తర్వాత కనిపెట్టినవే (ఫార్మకాలజీ).ఇంగ్లీషు వైద్యం అనబడే ఈ వైద్యానికి ముందు మన వాళ్ళు మందులేమీ వాడలేదా? వాడితే ఏం వాడారు? ఏ దేహధర్మాల ఆధారంగా వాడేవారు?పరిణామ క్రమంలో మనిషి పుట్టినప్పటి నుండీ బాధలు, జబ్బులు ఉండే ఉంటాయి కదా! తలనొప్పి, పంటి నొప్పి, దగ్గు, జ్వరం, దేహానికి దెబ్బలు, కాళ్ళు-చేతులు విరగడాలూ అన్నీ ఉంటాయి గదా! ఇంత ఎక్కువగా కాకపోయినా గుండెపోట్లు, షుగర్లు, బీపీలు, క్యాన్సర్లు కూడా ...పేర్లు వేరైనా - ఉండే ఉంటాయి!మరి వీటన్నింటినీ భరిస్తూ సుదీర్ఘ కాలం చూస్తూ ఊరుకోరు కదా? ఏదో ఒక వైద్యం చేసుకోకుండా బాధలు పడరు కదా?మొట్ట మొదటి మనిషే 'మొదటి వైద్యుడు'. మొట్ట మొదటి ఆడమనిషే 'మొదటి నర్సు'. అప్పట్నుండీ మానవుల బాధలను తగ్గించడానికి తమకు తెలిసిన, కనిపెట్టిన ప్రక్రియలను ఉపయోగిస్తూనే ఉన్నారు!గ్రీకులు, రోమన్లు, చైనా వారు, అరబ్బులు, భారతీయలు ఎక్కడి సమూహాలు అక్కడ వారివారి అనుభవంలో నేర్చుకొన్న విధానాల ఆధారంగా మనుషుల బాధలను తగ్గించడానికి వైద్యం చేసుకుంటూనే ఉన్నారుయయూరప్ లో 'గేలన్' (130-205 ఎ.డి) అనే ఆయన ప్రతిపాదించిన వైద్య సిద్ధాంతం ఆధారంగా 1500 సంవత్సరాల పాటు వైద్యం జరిగింది.వెసాలియస్' అనే శాస్త్రవేత్త దేహ నిర్మాణాన్ని (ఎనాటమీ), 'విలియం హార్వే' అనే ఇంకొక శాస్త్రవేత్త దేహ ధర్మాల్ని (ఫిజియాలజీ) శాస్త్రీయంగా అధ్యయనం చేసే వరకూ గేలన్ సిద్ధాంతం ప్రకారమే వైద్యం జరిగింది.మానవుడి ఆయుర్దాయం 100-110 సంవత్సరాలు. అయితే వంద సంవత్సరాల క్రితం వరకూ సగటు ఆయుర్దాయం 30-40 సంవత్సరాల మధ్యనే ఉండేది. ఈ రోజు అభివృద్ధి చెందిన దేశాలలో సగటు ఆయుర్దాయం 80 సంవత్సరాలకు పైగా ఉంటే, మన దేశంలాంటి వాటిలో 69 సంవత్సరాలకు పైగా ఉంది.ఆయుర్దాయం'తో పాటు 'శిశు మరణాల రేటు' వంటి అనేక ఆరోగ్య సూచికలన్నింటిలో ఇంత అభివృద్ధికి కారణం ఎందరెందరో శాస్త్రజ్ఞుల కృషే!అన్ని దేశాల వివిధ కాలాల పాత వైద్యాలలోని ఉపయోగపడే అంశాలన్నిటినీ ప్రయోగ నిరూపణ పూర్వకంగా మిళితం చేసుకున్నదే ఆధునిక వైద్యము.భారత దేశ వైద్యంలో 'సర్పగంధి' మొక్క వేళ్ళను కొన్ని శతాబ్దాల నుండి ఉపయోగిస్తున్నారు. ఈ వేళ్ళు నమిలితే కొంతమందికి ఆరోగ్యం మెరుగ్గా అనిపించేది. అలా ఎందుకనిపిస్తుందో తెలుసుకోవాలని 70 సంవత్సరాల క్రితం ప్రయోగశాలలో పరీక్షలు చేశారు. ఆ వేళ్ళలో 16 రకాల ఆల్కలాయిడ్స్ అనే రసాయనాలు ఉన్నాయి. వాటిలో ఒకటి అయిన "రిసర్పిన్" అనే ఆల్కలాయిడ్ తీసుకున్న వారికి 'అధికంగా ఉన్న రక్తపోటు' తగ్గుతోంది. మిగిలిన 15 ఆల్కలాయిడ్లకు దేహానికి ఉపయోగపడే ప్రభావం ఏమీ లేదని తేలింది. ఈ పరిశోధనల తర్వాత కూడా అందరికీ "సర్పగంధి వేళ్ళు మంచివి, అందరూ నమలండి" అని సలహా ఇస్తామా? అధిక రక్త పోటు ఉన్న వారికి మాత్రమే ఆ వేళ్ళలో నుంచి తీసిన 'రిసర్పిన్' అనే రసాయనాన్ని ఇస్తామా?అనేక అనవసర రసాయనాలు కలిగిన సర్పగంధి వేళ్ళను నమిలించినందుకు ప్రాచీన వైద్యాన్ని వెక్కిరిద్దామా? తప్పు గదా!కాలానికి వారికి తెలిసిన జ్ఞానాన్ని బట్టి కొన్ని బాధలకు కొన్ని వేళ్ళో, ఆకులో, పూలో, కాయలో, వాటి నుంచి వచ్చిన కషాయాలో ఇచ్చేవారు. కాలక్రమేణా దేహ నిర్మాణం, దేహ ధర్మం, రసాయన శాస్త్రం మనకు ఇంకా బాగా అర్థం అయినప్పుడు రోగాలకు సరైన కెమికల్స్ ను సరైన మెథాడ్‌లో ఇస్తున్నాము.గతంలో ప్రపంచంలో ఉన్న వైద్యాలన్నింటినీ అధ్యయనం చేసి వడకట్టినదే గదా 'ఆధునిక వైద్యం'.

# మెజార్టీ నేతలకు కష్టమేనట

గుంటూరు, మే 31, (న్యూస్ పల్స్)అక్కడ ఉన్నది జగన్. ఆయన తాడేపల్లి రాజ ప్రాసాదంలో ఉంటారు. ఆయనకు ఏమీ తెలియదు. మన పని మనదే అని వైసీపీలో ఎవరైనా అనుకుంటే మాత్రం తప్పులో కాలేసినట్లే. జగన్ రాజకీయం ఏంటో చంద్రబాబుకే అర్థం కావడంలేదు. మరి మిగిలిన వారికి అన్నీ తెలుసు అనుకుంటే బోల్తా కొట్టినట్లే కదా. వైసీపీ ఎమ్మెల్యేలు ఇప్పటికైతే రెండేళ్ల సీనియారిటీ సంపాదించారు. మరో మూడేళ్ళ పాటు పవర్ లో ఉంటారు. ఆ మీదట మళ్లీ టికెట్ వస్తుందా. ఎమ్మెల్యేలుగా నెగ్గుతారా. అంటే ఇదంతా డౌటేనట.జగన్ పుణ్యమాని ఎవరికీ తెలియని వారు, పెద్దగా జనాల్లో లేని వారు కూడా ఎమ్మెల్యేలుగా 2019 ఎన్నికలో గెలిచారు. వారిలో చాలా మంది మంత్రులుగా కూడా వెలుగుతున్నారు. అయితే ఇందులో ఎందరి సమర్థులు, మరెందరు మళ్ళీ పనికివస్తారు అన్న డేటా అయితే జగన్ దగ్గర పక్కాగా ఉందిట. పైగా ఎమ్మెల్యేలు ఎవరేం పని చేస్తున్నారు. వారు జనాలతో ఎలా కెనెక్ట్ అవుతున్నారు. పార్టీని ప్రభుత్వాని ఎలా ముందుకు తీసుకెళున్నారు ఇవన్నీ కూడా జగన్ బాగా అధ్యాయనం చేయిస్తున్నారుట. ఏ మాత్రం పార్టీ లైన్ కి భిన్నంగా ఉన్నా కూడా వచ్చేసారి టికెట్ దక్కడం కష్టమే అంటున్నారు. అంటే పెద్ద కత్తెర పడిపోతుంది అన్న మాట.వైసీపీలో తాజాగా ఒక ప్రచారం అయితే సాగుతోంది. మరి ఇది అధినాయకత్వం హెచ్చరికగా ఉంటుందని లీక్ చేసిందా లేక మరోటా అన్నది తెలియదు కానీ ఒక విషయం మాత్రం చూస్తే మెజారిటీ సిట్టింగుల సీటు చిరిగిపోతోందట. వచ్చే ఎన్నికల్లో దాదాపుగా వందకు పైగా వైసీపీ ఎమ్మెల్యేలకు టికెట్ ఇవ్వడానికి జగన్ ససేమిరా అంటున్నారుట. రెండేళ్ల పెర్ఫార్మెన్స్ చూసే జగన్ ఈ నిర్ణయం తీసుకుంటే గట్టిగా అయిదేళ్ళూ పూర్తి అయితే 151 మందిలో ఎందరికి టికెట్లు దక్కుతాయి అన్నది పెద్ద డౌటే మరి అన్నది వైసీపీలో తాజాగా వినిపిస్తున్న మాటగా ఉంది.జగన్ వచ్చే ఎన్నికల్లో కొత్త వారితోనే జనాల్లోకి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారట. తనతో పాటు బాగా పనిచేసే వారికి, మరీ ముఖ్యులు అనుకున్న వారికి మాత్రమే టికెట్లు కన్ ఫర్మ్ అన్నది తేలుతున్న విషయం. మిగిలిన వారంతా పూర్తిగా ఆశలు వదిలేసుకోవాల్సిందేనట. అంటే వందకు పైగా ఎమ్మెల్యేలు టికెట్ దక్కక మాజీలుగానే ఉంటారు అన్న మాట. మరి ఒక విధంగా జగన్ చేయబోయేది దుస్సాహసం. ఆయన అది చేస్తారా. చేస్తే వీరంతా టీడీపీలోకి జంప్ అయితే అపుడు సీన్ ఏంటి అన్నది కూడా ఆలోచించాలి కదా. అయితే జగన్ ఆ బెంగేమీ పెట్టుకోవడమే లేదుట. బాగా బ్యాడ్ గా ఉన్న వారినే తాను రిజెక్ట్ చేస్తారు కాబట్టి వారిని ఎవరి చేరదీసినా నిండా మునగడం ఖాయం. పైగా తన ఇమేజ్ తో మళ్ళీ కొత్తవారిని వెంటబెట్టుకుని ఫ్రెష్ లుక్ తో వెళ్తే జనామోదం కచ్చితంగా ఉంటుందని కూడా నమ్ముతున్నారుట. దీన్ని బట్టి చూడబోతే వన్ టైమ్ ఎమ్మెల్యేలుగానే చాలా మంది వైసీపీలో మిగలబోతున్నారు అన్న మాట.

# బాబుకు వరుస పెట్టి గుడ్ న్యూస్ లు



విజయవాడ, మే 31, (న్యూస్ పల్స్)చంద్రబాబు అంటేనే అదృష్టానికి మారు పేరుగా చెప్పుకోవాలి. ఎటువంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా రాజకీయాల్లోకి వచ్చి సుమారుగా పద్నాలుగేళ్ళ పాటు ముఖ్యమంత్రిగా పనిచేయడం అంటే మామూలు విషయం కాదు. ఎంతో ప్రజాదరణ ఉన్న టంగుటూరి ప్రకాశం, ఎన్టీయార్, వైఎస్సార్ లాంటి వారు అతి తక్కువ కాలమే ముఖ్యమంత్రులుగా పనిచేశారు. మరి ఈ పోలికను చూసుకున్నపుడు చంద్రబాబుకు దేవుడు ఏదో వరమే ఇచ్చి ఉంటారని అనిపిస్తుంది. సరే నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో చంద్రబాబు ఇంకా నాటౌట్ అంటున్నారు. చాన్స్ వస్తే మళ్ళీ సీఎం కావాలని, ఇంకా అదృష్టం నెత్తిన పాలు పోస్తే నేరుగా ప్రధాని కావాలన్న బోలేడు ఆశలు బాబులో ఉన్నాయి మరి.ఈ మధ్య కొన్ని కేసులు ఇబ్బంది పెడతాయని ఆయన ప్రత్యర్థులు బాగా ఆశపడ్డారు. ఆరు నెలల మించి ఏ కేసులో కూడా స్టేలు ఉండకూడదు అన్న సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అపుడెపుడో లక్ష్మీపార్వతి చంద్రబాబు మీద వేసిన కేసు బయటపడింది. బాబు ఆదాయాన్ని మించి ఆస్తులు కూడబెట్టారు అంటూ ఆమె 2005లో వేసిన కేసు మళ్ళీ ఏసీబీ కోర్టులో విచారణకు వస్తే ఏదో జరిగిపోతుంది అని అంతా అనుకున్నారు. ఎందుకంటే ఆమె ఇపుడు అధికార వైసీపీలో కీలక హోదాలో ఉన్నారు. కానీ ఈ కేసులో సరైన ఆధారాలు సమర్పించలేదని కోర్టు కొట్టేసింది. మొత్తానికి ఇక్కడ కూడా చంద్రబాబుకి గుడ్ న్యూసే వచ్చింది.ఇక అతి కీలకమైన కేసు మరోటి ఉంది. అదే ఓటుకు నోటు కేసు. ఈ కేసు వల్లనే చంద్రబాబు జాతకంతో పాటు ఏపీ జాతకం కూడా రివర్స్ గేర్ లోకి వెళ్ళిందని ఇప్పటికీ చెబుతారు. ఈ కేసులో బ్రహ్మదేవుడు కూడా మిమ్మల్ని కాపాడలేరు బాబూ అంటూ 2015లో ఒక అర్ధరాత్రి వేళ హడావుడిగా మీడియా మీటింగ్ పెట్టి మరీ కేసీయార్ గర్జించారు. కానీ ఆరేళ్ళుగా ఎలాంటి కదలికా లేని ఆ కేసు తాజాగా విచారణకు నోచుకుంది. ఇక ఈడీ కూడా రంగ ప్రవేశం చేసింది. దాంతో బ్రీఫ్డ్ మీ అన్న బాబుని మీద కూడా చార్జిషీట్ వేస్తారని అంతా ఊహించారు. చిత్రంగా రేవంత్ రెడ్డి ఈ కేసులో ఏ వన్ ముద్దాయి గా ఉన్నారు. మిగిలిన వారి పేర్లు ఉన్నాయి తప్ప చంద్రబాబు ప్రసక్తి ఎక్కడా లేదు. దీంతో టీడీపీ శ్రేణులు పండుగనే చేసుకుంటున్నాయి.చంద్రబాబు మీద ప్రత్యర్థులు ఎన్ని అనుకున్నా అనుకోవచ్చు కానీ. ఆయన్ని ఈ రోజుకు ఎవరూ కోర్టు మెట్లు ఎక్కించలేకపోయారు.

# ఇక ఈ అమ్మకాలు

తిరుపతి, మే 31, (న్యూస్ పల్స్)రైతులు పండించిన పంటల విక్రయాలకు ఏర్పాటు చేయ దలిచిన ఇ-ప్లాట్‌ఫారం (ఎలక్ట్రానిక్ వేదిక) నిర్వహణా బాధ్యతలను చక్కబెట్టడానికి కేంద్రం ఆదేశించిన మేరకు స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పివి)ను నెలకొల్పేందుకు అనుమతించింది. 'ఆంధ్ర ప్రదేశ్ రైతుల ఇ- విక్రయ కార్పొరేషన్ లిమిటెడ్' పేరుతో 2013 కంపెనీల చట్టం కింద రిజిస్ట్రేషన్ చేయించేందుకు సమ్మతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రూ. పది లక్షల షేర్ కేపిటల్‌తో కంపెనీని నెలకొల్పుతామని, తొలుత రూ.లక్ష మూలధన పెట్టుబడి పెట్టనున్నామని పేర్కొంది. వంద శాతం ప్రభుత్వ ఈక్విటీతో రిజిస్ట్రేషన్ చేసే కంపెనీకి వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఎపి రైతు బజార్ల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్ కాగా వ్యవసాయ, హార్టికల్చర్ కమిషనర్లు, మార్క్‌ఫెడ్ ఎమ్‌డి డైరెక్టర్లుగా ఉంటారు. వారి పేరుతో ఒక్కో షేరు పెడతారు. ఈ తతంగం కోసం కేంద్రానికి చెందిన సెంట్రల్ మార్కెటింగ్ ఫండ్ రూ.12.51 కోట్లు విడుదల చేయాలని మార్కెటింగ్ కమిషనర్ ఆదేశాలిచ్చారు. ఈ కొత్త కార్పొరేషన్ కేంద్రం నుండి నిధులు పొందడానికేనా లేక ఇంకేమైనా కారణాలున్నాయా అన్న చర్చ సాగుతోంది. కార్పొరేషన్ వచ్చాక వ్యవసాయ మార్కెట్ కమిటీల పాత్ర ఏమిటి, మద్దతు ధరల మాటేమిటీ అన్నవీ అనుమానాలే! కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ చట్టాలను రైతులంతా వ్యతిరేకిస్తున్న వేళ రాష్ట్రంలో ఆ చట్టాల్లోని వివిధ అంశాల అమలుకు చాప కింద నీరులా రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా ఏర్పాట్లు చేస్తోందన్న సందేహాలూ వ్యక్తమవుతున్నాగుంటూరులో ఏర్పాటు చేసే ఇ-ప్లాట్‌ఫారం... రైతులు, దేశ వ్యాప్తంగా, దేశం వెలుపల ఉన్న ట్రేడర్ల మధ్య వాణిజ్యం సులభతరం చేస్తుందని జిఓలో తెలిపారు. కొత్తగా నెలకొల్పే కార్పొరేషన్ ఇ-ప్లాట్‌ఫారం నిర్వహణ, బోర్డింగ్‌ల నిరంతర పర్యవేక్షణ, ఫారమ్ గేట్ వెలుపల రైతులకు, బయ్యర్లకు జరిగే కొనుగోళ్లు, అమ్మకాలు ఇత్యాది వ్యాపార లావాదేవీలకు ఏర్పాట్లు, రవాణా, చెల్లింపులు, ఒప్పందాల విషయంలో వివాదాల పరిష్కారం వంటి వాటిని చూస్తుందిగ్రామాల్లోనే రైతులకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలూ ఒకే గొడుగు కింద లభిస్తాయంటూ ఏడాది క్రితం సర్కారు రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె)ను నెలకొల్పిన విషయం తెలిసిందే. వాటికి అనుసంధానంగా మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ల (ఎంపిఎఫ్‌సి)ను ఏర్పాటు చేస్తోంది. ఆ సెంటర్ల పరిధిలో నిర్మించే వ్యవసాయ ఉత్పాదకాల నిల్వ ప్రదేశాలు, పంటల నిల్వకు గోదాములు, శీతల గిడ్డంగులు, యాంత్రీకరణ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు తొలి దశలో రూ.2,718 కోట్లు ఖర్చవుతాయని ప్రాజెక్టు అంచనాలు రూపొందించారు. దానిలో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.264 కోట్లు, కేంద్రం వాటా 74 కోట్లు, లబ్ధిదారుల వాటా రూ.18.91 కోట్లు, రుణం రూ.2,361 కోట్లు అని ప్రతిపాదనలు చేశారు. గతేడాది కోవిడ్ మొదటి దశ ఉధృతంగా ఉన్న సమయంలో ప్రజలకు ఉపశమనం కలిగించేందుకంటూ కేంద్రం 'ఆత్మ నిర్భర్ భారత్' ప్యాకేజిని ప్రకటించింది. దానిలో అగ్రి ఇన్‌ఫ్రా ఫండ్ (ఎఐఎఫ్) ఉంది. ఎఐఎఫ్ నిధులు కావాలంటే కేంద్రం వ్యవసాయ పంటల కొనుగోలుకు నెలకొల్పిన ఇ-ప్లాట్‌ఫారంలో రాష్ట్రాలు చేరాలంది. ఎఐఎఫ్ నిధుల కోసం సర్కారు ఆర్‌బికెలను, వాటికి అనుసంధానంగా మల్టీపర్పస్ సెంటర్లను, ఇ-ప్లాట్‌ఫారంను దశల వారీగా నెలకొల్పుతోందని తెలుస్తోంది. దానిలో భాగంగానే కేంద్ర నిధులు, రుణాల కోసం స్పెషల్ పర్పస్ వెహికిల్ (కార్పొరేషన్) ఏర్పాటైంది. ఈ సంవత్సరం మార్చి 24న మల్టీపర్పస్ సెంటర్ల ప్రాజెక్టు అంచనాలకు సంబంధించిన జిఒనెం12లో ఈ విషయాలు చూచాయగా ఉన్నాయి. ప్రాజెక్టు అమలు ఏజెన్సీకి 'ఆత్మ నిర్భర్', ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలతో నెలకొల్పిన అగ్రి ఇన్?ఫ్రా ఫండ్ నుండి ప్రాజెక్టు విలువలో పది శాతం రూ.251.69 కోట్లు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పుడు సదరు ఏజెన్సీని నెలకొల్పుతున్నారు.

# రోడ్డున పడ్డ రోల్డ్ గోల్డ్ పరిశ్రమ

విజయవాడ, మే 31, (న్యూస్ పల్స్)బందరు రోల్డ్‌గోల్డ్ పరిశ్రమపై కరోనా సెకండ్ వేవ్ ప్రభావం తీవ్రంగా పడింది. కరోనా నేపథ్యంలో ఏప్రిల్ 25 నుంచి జ్యూయలరీ పార్కుకు పూర్తి స్థాయి లాక్‌డౌన్ ప్రకటించడంతో ఆభరణాల తయారీ నిలిచిపోయింది. వరుసగా రెండో సీజన్లోనూ మూతపడడంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు. తయారీ నిలిచిపోవడంతో 25 వేల మంది పీస్ వర్క్ కార్మికులు ఆదాయాన్ని కోల్పోయి పస్తులుండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.రోల్డ్‌గోల్డ్ ఆభరణాల తయారీ పరిశ్రమకు బందరు పెట్టింది పేరు. బందరులోని పోతేపల్లి ఇమిటేషన్ జ్యూయలరీ పార్కులో, వెలుపలా ఉన్న 340 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా యూనిట్లలో నెలవారీ టర్నోవర్ రూ.20 కోట్లుగా ఉంటుంది. ఇక్కడ తయారైన ఆభరణాలు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ముంబయి, కొల్‌కత్తా, ఢిల్లీ ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోని పలు పట్టణాలకు రవాణా అవుతాయి. కరోనా ఫస్ట్‌వేవ్ లాక్‌డౌన్ తర్వాత ఈ పరిశ్రమ టర్నోవర్ సగానికి అంటే రూ.10 కోట్లకు పడిపోయింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో టర్నోవర్ క్రమంగా పెరిగి రూ.15 కోట్లకు చేరింది. పరిశ్రమ కాస్త కోలుకుంటుందనగానే కరోనా సెకండ్ వేవ్ ఉధృతమవడంతో మన రాష్ట్రంతోపాటు దేశంలోని అనేక రాష్ట్రాల్లో కర్ఫ్యూ, మళ్లీ లాక్‌డౌన్ పెట్టడంతో వ్యాపారం మరోసారి కుంటుబడింది. స్థానికంగానూ పాజిటివ్ కేసులు పెరగడంతో ఏప్రిల్ 25వ తేదీ నుంచి రోల్డ్‌గోల్డ్ తయారీదారులు పూర్తిగా తయారీని నిలిపివేసి లాక్‌డౌన్ ప్రకటించారు. వరుసగా రెండేళ్ల నుండి ఆదాయాలు కోల్పోవడంతో పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోయిందని ఆందోళన చెందుతున్నారు. రోల్డ్‌గోల్డ్ పరిశ్రమలో ప్రత్యక్షంగా ఐదు వేల మంది పని చేస్తున్నారు. రాగి తీగలు చుట్టడం, డిజైన్లు అద్దడం, పూసలు ఎక్కించడం, ఎలక్ట్రిక్ ప్లేటింగ్‌తో నగిషీలు చెక్కడం, ప్యాకింగ్ చేయడం తదితర పనులను మరో 25 వేల మంది కార్మికులు చేస్తున్నారు. వీరికి పీస్ వర్కు ప్రాతిపదికన చెల్లింపులు జరుగుతాయి. కిలో ఆభరణాలు తయారు చేసే కార్మికునికి రోజుకు రూ.400 ఆదాయం వచ్చేది. నెల రోజులుగా పనులు లేకపోవడంతో ఆదాయాలు కోల్పోయి వీరంతా పస్తులుండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయినేను, నా కుమారుడు గాజులు తయారు చేస్తాం. జత గాజులకు రూ.1.50 ఇచ్చే వారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.350 ఆదాయం వచ్చేది. కంపెనీ మూతపడడంతో పనిలేక ఆదాయం కోల్పోయాం. కుటుంబం గడవడం లేదు.

# ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కేది ఎలా

విజయవాడ, మే 31, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో కరోనా కేసుల సంఖ్య పెరుగుతుంది. ఖాజానా వెక్కిరిస్తుంది. లాక్ డౌన్ విధించకపోయినా ఈ రెండు నెలల్లో రాష్ట్ర ఆదాయం గణనీయంగా తగ్గే అవకాశాలు కన్పిస్తున్నాయి. మరో వైపు సంక్షేమ పథకాలకు నిధులను వెచ్చించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జగన్ కరోనా తొలిదశలో ప్రకటించిన విధానానికి ఈసారి స్వస్తి చెప్పినట్లే కనపడుతుంది. ఆర్థిక భారం ఎక్కువ కావడంతో కోవిడ్ బాధితులకు ఆర్థిక సాయం అందించలేకపోతున్నారు.కరోనా తొలిదశలో వచ్చినప్పుడు కరోనా బాధితులకు జగన్ రెండు వేల రూపాయల నగదును ఇచ్చారు. వారు కోలుకునేందుకు, పౌష్టికాహారం తీసుకునేందకు ఇది ఉపయోగపడుతుందని జగన్ ఏ రాష్ట్రంలో లేని విధంగా ఈ ఆర్థిక సాయాన్ని ప్రకటించి అప్పట్లో అందరి ప్రశంసలను అందుకున్నారు. కానీ ఈ సారి కేసులు సంఖ్య పెరుగుతోంది. రోజుకు పదివేలకు పైగా కేసులు నమోదవుతున్నాయి.కరోనా బాధితులు పెరుగుతున్న దశలో ఈ పథకం అమలు చేయడం జగన్ కు కష్టంగా మారింది. తొలిదశలోనే ఈ పథకాన్ని మధ్యలోనే నిలిపేశారు. పేదలకు ఈ పథకం ఉపయోగపడుతుందని జగన్ భావించినా అందరికీ వర్తింప చేయడతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తాయి. దీంతో ఈసారి ఈ విధానాన్ని అమలు చేసే ఆలోచనే జగన్ చేయడం లేదు. వీలయినంత త్వరగా వ్యాక్సినేషన్ పూర్తి చేయాలన్న ఉద్దేశ్యమే కన్పిస్తుంది.మరో మూడు నెలలు కరోనా సంక్షోభం తప్పదంటున్నారు. ఇది జగన్ సర్కార్ కు ఇబ్బంది కరంగా మారనుంది. ఉద్యోగుల జీతభత్యాలను సకాలంలో చెల్లించలేని పరిస్థితి. ఇప్పటికే శక్తికి మించిన అప్పులు చేసిన జగన్ కొత్త పథకాలకు ఫుల్ స్టాప్ పెట్టాలన్న యోచనలో ఉన్నారు. ఆర్థిక శాఖ కూడా జగన్ కు ఈ సూచన చేసినట్లు తెలిసింది. మొత్తం మీద ఏపీ ఖజానా వెక్కిరిస్తుండటంతో జగన్ కు భవిష్యత్ లో ఆర్థికంగా పెను ఇబ్బందులు తప్పవన్న హెచ్చరికలు విన్పిస్తున్నాయి..

# హస్తిన సలహాదారులు ఇంటికేనా

విజయవాడ మే 31, (న్యూస్ పల్స్)ఏపీ ప్రభుత్వానికి రాష్ట్రంలోనే కాకుండా ఢిల్లీలోనూ అనేక మంది సలహాదారులు ఉన్నారు. లెక్కకు మిక్కిలి గా సలహాదారులను పెంచిపోషిస్తున్న ప్రభుత్వంగా కూడా వైసీపీ ఆరోపణలు ఎదుర్కొంటోంది. అయితే.. ఇంత మంది సలహాదారులను పెట్టుకుని కూడా ఇటు రాష్ట్రంలోను, అటు కేంద్రంలోను ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. నిజానికి ప్రస్తుతం కరోనా సమయంలో ప్రజలకు ఎలాంటిసేవలు అందించాలి? ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఎలాంటి సంబంధ బాంధవ్యాలు ఉండాలి ? అనే విషయాలపై సలహాదారులు దృష్టి పెడుతున్నట్టు కనిపించడం లేదని వైసీపీలోనే పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.ప్రధానంగా.. ఢిల్లీలో నలుగురు సలహాదారులు ఉన్నారు. దేవులపల్లి అమర్ సహా నలుగురు ఢిల్లీలో కార్యకలాపాలను చక్రదిద్దుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై జాతీయ మీడియాలో వ్యతిరేక వార్తలు రాయకుండా చూడాల్సిన అమర్ కానీ, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని కేంద్రం నుంచి అందాల్సిన సహాయం ఏపీకి సకాలంలో అందించే విషయంలోనూ ఈ సలహాదారులు ఎక్కడా చొరవ చూపించలేక పోతున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఈ విషయంలో వైసీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.అంతేకాదు.. ప్రస్తుతం ఏపీకి రెమ్‌డిసివర్ ఇంజన్లు సహా.. వ్యాక్సిన్‌లను కేంద్రమే ఇవ్వాల్సి ఉందని.. తమ చేతుల్లో ఏమీ లేదని కూడా ప్రభుత్వం చెబుతోంది. మరి ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు కేంద్రంతో నిరంతరం టచ్‌లో ఉండాల్సిన సలహాదారులు ఢిల్లీలో తమకు కేటాయించిన రూంలకే పరిమితమవుతున్నారనే వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం. మరోవైపు ఒకరిద్దరే సలహాదారులు ఉన్న తెలంగాణకు కోరినన్న వ్యాక్సిన్‌లు లభిస్తుండగా.. ఏపీకి మాత్రం అలా లభించడం లేదు.మరి ఈ విషయంలోనూ సలహాదారులు ఎందుకు చొరవ తీసుకోవడం లేదనేది ప్రశ్న. నెలకు 4 లక్షల రూపాయల వేతనంతో సహా.. ఇతర అలవెన్సులు పొందుతున్నా.. పనిచేయడం లేదా? లేదా.. తాము సలహాలు ఇచ్చినా.. వైసీపీ సర్కారు తీసుకోదనే నిశ్చితాభిప్రాయంలో ఉన్నారా అనే సందేహాలు వ్యక్తమవుతుండడం గమనార్హం.

# రెండేళ్ల తర్వాత చెక్కు చెదరని ఓటింగ్

తిరుపతి, మే 31, (న్యూస్ పల్స్)దారిలో అయినా సరే ఎంత దూరమైనా నడవవచ్చు. అలాగే చీమలు దూరని చిట్టడవిలో సైతం దట్టమైన చీకటిలోనూ అడుగులు వేయవచ్చు. అయితే ఇవన్నీ చేయాలంటే కాలికి బలం ఉంటే మాత్రమే సరిపోదు, రేపటి మీద ఆశ ఉండాలి. ఎంత కష్టపడినా భవిష్యత్తు బాగుంటుంది అన్న భరోసా ఉండాలి. ఏపీలో విపక్షాలకు ఇపుడు అదే కరువు అయింది. జగన్ రెండేళ్ల పాలన పూర్తి అయినా విపక్ష శిబిరం నిండా నిరాశతో కొట్టుమిట్టాడుతోంది. వచ్చే ఎన్నికల్లో గెలుస్తాము అన్న ధీమా ఏ ఒక్క పార్టీకీ కొంచమైనా లేకుండా పోయింది.ఏపీలో ఈ రోజున ప్రతిపక్ష శిబిరంలో ఎవరికీ కూడా మిణుకుమిణుకుమనే చిన్నపాటి ఆశ కూడా లేదంటే నమ్మాల్సిందే. ముందుగా చెప్పుకుంటే బీజేపీకి సీన్ కాలిందనే అంటున్నారు. తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికల ఝలక్ ఆ పార్టీ ఎక్కడ ఉందో చెప్పేసింది. కాంగ్రెస్ మరింతగా కుదేల్ అయిపోయి ఇక ఆంధ్రా అన్న మాట నోట పలకడం కూడా వేస్ట్ అనుకుంటోంది. జనసేన విషయానికే వస్తే అక్కడంతా వన్ మ్యాన్ షోగా సినిమా నడుస్తోంది. ఒక విధంగా జనసేనాని పూర్తి అయోమయంలో పడిపోయారు అనే అంటున్నారు. ఉన్నంతలో తెలుగుదేశమే బహుమొనగత్తెగా కనిపిస్తోంది.సరే మేమే రేపటి రోజున అధికారంలోకి వస్తామని నిబ్బరంగా పసుపు పార్టీ చెప్పుకోవడానికి అవకాశమే లేదని అంటున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో 38 శాతం ఓట్లు వస్తే రెండేళ్ల తరువాత జరిగిన తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికల్లో అది కాస్తా 32 శాతానికి పడిపోయింది. దాంతో మరో మూడేళ్ళ నాటికి ఎంతలా దిగనారిపోతామో తెలియదన్నదే తమ్ముళ్ళ బాధట. ఇక ప్రజా ఉద్యమాలు అంటున్నా అవేవీ ఫలితాన్ని ఇవ్వడంలేదు. మరో వైపు చూస్తే రెండేళ్ళ పాలన తరువాత కూడా వైసీపీ ఓటు బ్యాంక్ కసికందకుండా ఉండడమూ టీడీపీ శిబిరాన్ని తెగ కలత పెట్టేస్తోంది.సాధారణంగా ఏ ప్రభుత్వానికైనా రెండేళ్ళ తరువాత మెల్లగా ప్రజా వ్యతిరేకత రావడం ఖాయం. కానీ జగన్ సర్కార్ తీరు అందుకు విరుద్ధంగా ఉంది. జనాలు ఇప్పటికీ జై జగన్ అంటున్నారు. జగన్ కి చూస్తే పాలనానుభవం కొత్తం, ఒకరిద్దరు మంత్రులు తప్ప అంతా కొత్తవారే. పైగా జగన్ సైతం వన్ మ్యాన్ షో గానే కథ నడిపిస్తున్నారు. అయినా సరే వైసీపీని జనం మెచ్చుతున్నారు. పార్టీ కూడా అంతకంతకు పటిష్టం అవుతోంది. ఇదే తీరు కొనసాగితే మాత్రం వచ్చే ఎన్నికల్లో విపక్షానికి చుక్కలూ చిక్కులూ తప్పవనే విశ్లేషణలు ఉన్నాయి. ఒక్క చాన్స్ అంటూ గద్దెనెక్కిన జగన్ మరీ ఇంతలా పాతుకుపోతే ఏం చేయాలో తెలియక విపక్ష శిబిరం కకావికలే అవుతోంది.

# మళ్లీ మొదటికొచ్చిన ముడసర్లోవ రిజర్వాయర్

విశాఖపట్టణం, మే 31, (న్యూస్ పల్స్)రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించుకున్నట్లు'... నగరంలో కరోనా విలయం సృష్టిస్తుంటే అధికార పార్టీ నాయకులు ముడసర్లోవ రిజర్వాయర్ వైపు అడుగులు వేస్తున్నారు. ముడసర్లోవ చెరువును అభివృద్ధి చేయాల్సిందే. దీంట్లో ఎవరికీ భిన్నాభిప్రాయం ఉండనక్కర్లేదు. అయితే ప్రస్తుత సవాళ్లను అధిగమించకుండా ముడసర్లోవపై దృష్టి సారించడంపైనే పలు అనుమానాలు నగర వాసుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రజా ఆస్తిగా ఉన్న ఈ 30 ఎకరాల ముడసరలోవ రిజర్వాయర్ పరిసరాలను పిపిపి పేర ప్రైవేట్‌కు అప్పగించేందుకే ఈ హడావుడి నెలకొంటుందన్నది నగర వాసులు భావిస్తున్నారు. ప్రజా సంక్షేమం–అభివృద్ధి ఏ ప్రభుత్వానికైనా రెండూ రెండు కళ్లు. ఈ రెండింటికంటే ముందుగా ప్రజారోగ్యం పెద్ద సమస్యగా నగరంలో ముందుకొచ్చింది. జివిఎంసి పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్లన్నీ పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేస్తున్నాయా? అక్సిజన్ బెడ్స్ అన్నిట్లోనూ అందుబాటులో ఉంచారా? వైద్యులు, సిబ్బంది ఉన్నారా? ఏ రోగంతో వెళ్లినా చికిత్స అందించే పరిస్థితి ఉందా? అంటే పాలకులు తెల్లముఖం వేయాల్సిందే. ఈ ఏడాది ఏప్రిల్ 9న జరిగిన తొలి జివిఎంసి కౌన్సిల్ సమావేశం సందర్భంగా ముడసర్లోవ రిజర్వాయర్ ప్రాజెక్టు అభివృద్ధికి ప్లాన్ చర్చకు రాగా ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ తీర్మానం సరైంది కాదంటూ సభ్యులు తిరస్కరించారు. తాజాగా ముడసర్లోవ రిజర్వాయర్‌ను రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి నేతృత్వంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, విఎంఆర్‌డిఎ కమిషనర్, జివిఎంసి అధికారులు పర్యటించారు. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు దీనిపై సున్నితంగా అభ్యంతరం తెలియజేశారు. కరోనా నుంచి ప్రజలను ముందు రక్షించాలని విజ్ఞప్తి చేశారు. పైగా నాడు కౌన్సిల్‌లో డిపిఆర్ మాత్రమే తయారు చేస్తామని చెప్పి ఇప్పుడు ఏకంగా ప్రాజెక్టు పనుల కోసం రూ.50కోట్ల నుంచి రూ.70కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు ఏమిటని ప్రశ్నించారు. తర్వాత జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ సైతం ముడసర్లోవ విషయంపై గత కౌన్సిల్ వ్యతిరేకిస్తే, ఇప్పుడెందుకు రాజకీయం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. సందెట్లో సడేమియా అన్న చందాన ముడసరలోవ ప్రాజెక్టుపై అధికార పార్టీ నేతల కల్లు పడ్డాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టిడిపి నాయకులు ఈ అంశంపై నోరుమెదపని పరిస్థితులు ఉంది. గతంలో ఆ పార్టీ అధికారంలో ఉన్న సందర్భంలో స్థానిక ఎమ్మెల్యే ఈ చెరువులో సిల్టు తీసే కాంట్రాక్టు దక్కించుకుని, నిధులు భోంచేశారన్న ఆరోపణలు లేకపోలేదు.

కాబట్టి ఇరు పార్టీలకూ ఇదో కల్పవృక్షంగా మారిపోయిందన్నది స్పష్టంగా తెలుస్తోంది. అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి వత్తాసు పలకడవే జివిఎంసి యంత్రాంగం పని అన్నదానికి ఇదే తార్కాణం. విజృంభిస్తున్న కరోనాతో ప్రజలు ప్రాణాలను కోల్పోతున్నారు. వైద్యం ఇంకా అందని స్థితి కొనసాగుతుంది. వ్యాక్సినేషన్‌కు అతీ గతీ లేదు. లక్షల నగర జనాభాలో వ్యాక్సినేషన్ వేసింది వేలసంఖ్యలోనే. ఆరోగ్య పరిస్థితులు, వాతావరణం మెరుగు పడకుండా అభివృద్ధి అంటూ రాగం అందుకోవడం ఎంత వరకూ సమంజసం? పైగా దీంట్లో రాజకీయ ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయన్నది స్పష్టంగా తెలుస్తోంది. ముడసరలోవపై గడచిన 6ఏళ్ల కాలంలో జివిఎంసి, విఎంఆర్‌డిఎ అభివృద్ధి పేర ఖర్చు చేసిన నిధుల వివరాలను బయటపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రెగ్యులరైజేషన్ సాధనే ప్రధాన ధ్యేయంగా...

అమరావతి మే 31 వైద్య ఆరోగ్య శాఖ లోని డి.ఎస్.సి కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులు తమ రెగ్యులరైజేషన్ ప్రధాన ధ్యేయంగా సోమవారం నుంచి ఉద్యమించేందుకు సన్నద్ధమయ్యారు. ఆంధ్రప్రదేశ్ డి.ఎస్.సి కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (జె.ఏ.సి) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం పి.హెచ్.సిల ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఇరవై ఏళ్ళ నాటి రెగ్యులర్ కలను తాను అధికారంలోకి వస్తే తప్పకుండా తీరుస్తానని హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా నేటికీ అది కలగానే మిగిలిపోతుండటంతో తీవ్ర నిరాశకు గురైన కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులు ఎట్టకేలకు తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యమబాటపట్టారు. ప్రజాసంకల్ప యాత్రలోనూ, ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ ఇచ్చిన అర్హులైన కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ చేస్తామన్నా హామీ ని ప్రస్తుత కోవిడ్ కీలకమైన సమయంలోనైనా నెరవేరిస్తే ఇచ్చిన మాటకు విలువైన వుంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తుంటే వైద్య ఆరోగ్య శాఖ లోని అన్ని క్యాడర్ల ఉద్యోగుల కృషి కి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రశంసల జల్లు కురిపించడమే కాకుండా వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేస్తుండటం ఆనందదాయకమేనని అన్నారు. అయితే, గత ఇరవై ఏళ్లుగా ఎలాంటి ఉద్యోగభద్రతా లేకుండానే ప్రాణాంతక మహమ్మారి కరోనా కట్టడికి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రాణత్యాగాలు చేస్తున్నా కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల పట్ల ఎందుకు జాలి, దయ కలగడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత ప్రభుత్వాలు కమిటీల


**ఉద్యమానికి సిద్ధమైన కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులు**

పేరుతో తమ క్రమబద్ధీకరణ తీవ్ర కాలయాపన చేసి దగా చేశాయని, మ్యానిఫెస్టో ని పవిత్ర గ్రంధాలైన భగవద్గీత, బైబిల్, ఖురాన్ లా భావిస్తూ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి అన్ని అర్హతలున్నా కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ విషయం లో ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదంటున్నారు. మాట తప్పని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమకు తప్పకుండా న్యాయం చేసి తీరుతారన్న ఆశ జరుగుతున్న తాత్సారం తో రోజురోజుకీ సన్నగిల్లిపోతుందన్నారు. అందుకే తమ ఘోష ప్రభుత్వానికి గట్టిగా వినిపించేందుకే సోమవారం నుంచి నిరంతరాయంగా నిరసన కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించదలిచామని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం నాటి కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోమ్మనకుండా పొగ పెడుతున్నారా

విజయవాడ, మే 31, (న్యూస్ పల్స్)వైసీపీ అధినేత, సీఎం జగన్.. కేంద్రంలోని మోడీ సర్కారు విషయంలో చాలా క్లియర్‌గా ఉన్నారు. మరి మోడీ కూడా అలానే ఉన్నారా ? అనేది కీలక ప్రశ్న. ప్రత్యేక హోదా, పోలవరం నిధులు.. వెనుకబడిన జిల్లాలకు నిధులు వంటి విషయాలే కాకుండా.. గత ఏడాది లాక్‌డౌన్ కారణంగా తలెత్తిన ఆర్థిక నష్టాల నుంచి కూడా ఏపీని ఆదుకోవడంలో మోడీ సర్కారు ఒకింత విఫలమైంది. అయినా.. జగన్ 'ప్లీజ్.. ప్లీజ్'' అంటున్నారే తప్ప.. యుద్ధానికి మాత్రం సిద్ధమవలేదు. పైగా ముఖ్యమంత్రులతో ప్రధాని సమీక్షలో జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ప్రధాని మోడీపై అసంతృప్తి వ్యక్తం చేస్తే జగన్ ఆఘమేఘాల మీద మోడీకి మద్దతుగా హేమంత్‌ను తప్పుపట్టడం జాతీయంగా చర్చనీయాంశమైంది. మోడీకి జగన్ ఎంత సాగిలపడుతున్నాడో ? అన్న చర్చలు కూడా నడిచాయి. జగన్ తాను మోడీకి ఎంతో సపోర్టర్‌ను అన్నది పదే పదే చెప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇప్పుడు వ్యాక్సిన్ విషయంలోను, నిధుల విషయంలోనూ కూడా మోడీ సర్కారు ఏపీకి సహకరించడం లేదు. కేంద్ర ప్రభుత్వం 18 నుంచి 45 మధ్య వయసు వారికి కూడా కొవిడ్ వ్యాక్సిన్ ప్రారంభించాలని ఏప్రిల్ 15వ తేదీన నిర్ణయించింది. దీనికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించింది. దీంతోపాటు వ్యా క్సిన్ ఉత్పత్తి కంపెనీలతో సొంతంగా మాట్లాడుకోవాలని కూడా రాష్ట్రాలకు సూచించింది. ఏప్రిల్ 20 నుంచి 29వ తేదీ వరకూ వ్యాక్సిన్ కంపెనీలతో చర్చించుకుని, మే 1వ తేదీ నుంచి 'టీకా ఉత్సవ్' ప్రారంభించాలని కేంద్రం సూచించింది. కానీ, ఇంతలోనే మళ్లీ కేంద్రం ప్లేట్ ఫిరాయించి.. వ్యాక్సిన్‌ను తన అదుపులోకి తెచ్చుకుంది. దీంతో ఏపీలో కేసులు ఎక్కువగా ఉన్నప్పటికీ.. వ్యాక్సిన్ కేటాయింపులు మాత్రం చాలా తక్కువగా ఉన్నాయి. ఇక, ఆక్సిజన్ సరఫరా విషయంలోనూ కేంద్రం పైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏపీకి దాపురించింది. అయినప్పటికీ.. జగన్ మాత్రం పన్నెత్తు మాట అనడం లేదని.. విమర్శలు వస్తున్నాయి. కానీ, ఈ విషయంలో లోతుగా పరి శీలన చేస్తే.. బీజేపీని తప్పుపట్టేలా.. తాను వ్యాఖ్యలు చేయకుండానే.. ప్రజల నుంచి ఆ పార్టీ దూరమయ్యేలా జగన్ వ్యవహరిస్తున్నారని.. ప్రజలు బీజేపీ నేతలు చేస్తున్న పనులను నిశితంగా గమనిస్తున్నారని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మరి జగన్ ఆశించింది జరుగుతుందా ? అనేది చూడాలి.

# కోవిడ్-32 కూడా వస్తాదేమో అని శాస్త్రవేత్తల ఆందోళన




న్యూయార్క్ మే 31 కరోనా వైరస్ వ్యాధి 2019లో మొదటిసారి బయటపడింది. అందుకే దానికి కోవిడ్–19 అని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేరు పెట్టింది. ఇక అమెరికా సైంటిస్టులు కొత్త వార్నింగ్ ఇచ్చారు. కోవిడ్–26, కోవిడ్–32 కూడా వస్తాయేమో అని శాస్త్రవేత్తలు అనుమానం వ్యక్తం చేశారు. కోవిడ్–19 ఆనవాళ్లు కనుక్కోలేకపోతే.. వైరస్ విలయాలు తప్పవని అమెరికా శాస్త్రవేత్త స్కాట్ గాట్లిబ్ తెలిపారు. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో.. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్‌డీఏ) కమిషనర్‌గా స్కాట్ గాట్లిబ్ ఉన్నారు. ఇప్పుడు ఆయన ఫైజర్ కంపెనీ బోర్డులో సభ్యుడిగా కొనసాగుతున్నారు. సార్స్ సీవోవీ2 వైరస్ వుహాన్ ల్యాబ్ నుంచి లీకైనట్లు ఆధారాలు బలపడుతున్నాయని, ఇలాంటి సమయంలో ప్రపంచ దేశాలకు చైనా సహకారం కావాలని, ఎందుకంటే భవిష్యత్తు మహమ్మారులను అడ్డుకోవాలంటే ఈ చర్యలు తప్పవని స్కాట్ తెలిపారు. ల్యాబ్ నుంచి వైరస్ లీక్ కాలేదన్న వాదనలకు ఇప్పటి వరకు చైనా ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదని కూడా ఆయన పేర్కొన్నారు. కరోనా మహమ్మారి ఎలా పుట్టిందో తెలియకుండా భవిష్యత్తులో సంభవించే వ్యాధులను పసికట్టలేమని టెక్సాస్ చిల్డ్రన్ హాస్పిటల్ కో డైరక్టర్ పీటర్ హోటెజ్ తెలిపారు. కోవిడ్19 ఆనవాళ్లను గుర్తపట్టనంత వరకు కోవిడ్–26, కోవిడ్–32 వచ్చినా ఆశ్చర్యంలేదని ఆయన అన్నారు. వుహాన్‌లో ఉన్న చేపల మార్కెట్లో నిజానికి తొలుత వైరస్ ఆనవాళ్లను గుర్తించారు. జంతువుల నుంచి మనుషులకు ఆ వైరస్ సోకి ఉండి ఉంటుందని అంచనా వేశారు. కానీ ఇప్పుడు శాస్త్రవేత్తల్లో స్వరం మారుతున్నది. వైరస్ ల్యాబ్ నుంచి లీకైనట్లు అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ చేసిన వాదన బాటలోనే బైడెన్ ప్రభుత్వం అడుగేసింది. కరోనా పుట్టుకపై లోతైన అధ్యయనం చేయాలని బైడెన్ ప్రభుత్వం ఆదేశించడంతో కథ మళ్లీ మొదటికొచ్చినట్లు అయ్యింది. గతంలో ట్రంప్ ఆరోపణలను వ్యతిరేకించిన అంటువ్యాధుల నిపుణుడు ఆంటోనీ ఫౌచీ కూడా ఇప్పుడు మాట మార్చేశారు. ఇక ట్రంప్‌ను ఖండించిన వైట్‌హౌజ్ మీడియా కూడా ఏమీ చెప్పలేని స్థితిలోకి వెళ్లిపోయింది. వుహాన్‌లో పనిచేసే పరిశోధకులకు 2019 నవంబర్ కన్నా ముందే వైరస్ సోకినట్లు ఇటీవల వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం రాయడంతో మళ్లీ వైరస్ ఆనవాళ్ల గురించి అంతర్జాతీయంగా చర్చ మొదలైంది. చైనాలో సుదీర్ఘ కాలం పాటు విచారణ చేపట్టేందుకు శాస్త్రవేత్తలను అనుమతించాలని, అక్కడి మనుషులు.. జంతువుల నుంచి రక్త నమోనాలు సేకరించాలని హోటెజ్ తెలిపారు. ఆంక్షలు విధిస్తామని బెదిరించి అయినా ఈ పని చేయాలని ఆయన అన్నారు. సైంటిస్టులు, ఎపిడమాలజిస్ట్‌లు, వైరాలజిస్టులు, బ్యాట్ ఎకాలజిస్ట్ పరిశోధకులు హుబే ప్రావిన్సులో సుమారు ఆరు నెలలు ఉండాలని హోటెజ్ చెప్పారు.

# మహిళలకు ఇచ్చిన వైఎస్సార్ పెళ్లి కానుక ఏమైంది

**అబద్దాల ప్రచారంలో గోబెల్స్ ను మించిపోయిన జగన్: తులసిరెడ్డి**



విజయవాడ మే 31 అబద్దాల ప్రచారంలో జగన్ గోబెల్స్‌ను మించిపోయారని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి వ్యాఖ్యానించారు. మహిళలకు ఇచ్చిన వైఎస్సార్ పెళ్లి కానుక ఏమైందని ప్రశ్నించారు. మేనిఫెస్టో మాటల్లో భగవద్గీత, ఖురాన్, బైబిల్.. చేతల్లో మాత్రం చిత్తు కాగితమని మండిపడ్డారు. "ప్రతి రైతు కుటుంబానికి పెట్టుబడి కోసం రూ.50 వేలు ఇస్తాం, పంట వేసే సమయానికి మే నెలలో రూ.12,500 చొప్పున ఇస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీప్రస్తుతం ఇస్తున్నది ఏడాదికి రూ.7,500 చొప్పున ఐదేళ్లకు రూ.37,500, కోత కోసింది రూ.12,500, దీనిని ఏమంటారు సీఎంగారు..?" అని ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా సాధన ద్వారా చేస్తామన్నారని అన్నారని... ప్రతి ఏడాది జనవరి 1న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు.. చేశారా అని నిలదీశారు. అగ్రిగోల్డ్ బాధితుల హామీని నెరవేర్చారా అని మండిపడ్డారు. సీపీఎస్ రద్దు చేస్తామని...పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని, సకాలంలో పీఆర్సీ అమలు చేస్తామని ప్రభుత్వ ఉద్యోదగులకు ఇచ్చిన హామీ నెరవేరిందా..? అని తులసిరెడ్డి ప్రశ్నించారు.

## తిరిగి ప్రారంభమైన వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు

హైదరాబాద్ మే 31 రాష్ట్రంలో కరోనా లాక్‌డౌన్ సడలింపు దృష్ట్యా భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ధరణి పోర్టల్ ద్వారా నేటి నుంచి వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని ప్రకటించింది. స్లాట్ల బుకింగ్ విధానంలో తహశీల్దార్ కార్యాలయ్యాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని పేర్కొంది. మాస్కు ధరించడం, భౌతిక దూరం వంటి కరోనా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించింది. వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు కూడా స్లాట్ బుకింగ్ ద్వారానే జరుగుతాయని పేర్కొంది. ఒక్కో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రోజుకు 24 స్లాట్లు అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు ఉన్నదగ్గర రోజుకు 48 స్లాట్లు ఉంటాయని వెల్లడించింది. క్రయ, విక్రేతలతోపాటు ఇద్దరు సాక్షులకు ఆన్‌లైన్ పాస్‌లు మంజూరు చేస్తామని, ఇతరులకు అనుమతి లేదని స్పష్టం చేసింది. ఏడుగురికి మించి రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఉండకూడదని ఆదేశాలు జారీచేసింది. ఈసీలు, సీసీలు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే జారీచేయాలని పేర్కొంది.

## సోమశిల ప్రాజెక్టుపై మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి 'ప్రత్యేక' దృష్టి.


**ప్రాజెక్టు పనులను పరుగులెత్తించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్**

నెల్లూరు జాయింట్ కలెక్టర్(రెవెన్యూ) ఆధ్వరంలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబుకు ఆదేశాలు జారీ చేశారు. సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్ 1, భూసేకరణ,ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీల గురించి జిల్లా స్థాయి ఇరిగేషన్ అధికారులను మంత్రి మేకపాటి ఆరా తీశారు. భూసేకరణ సమస్యను త్వరగా పరిష్కరించాలని సోమశిల ప్రత్యేక కలెక్టర్ నాగేశ్వరరావుకి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. సోమశిల హెచ్‌ఎల్సీ ఫేజ్ 2 భూ సేకరణపైనా సర్వే చేయించాలని స్పెషల్ కలెక్టర్ కు ఆదేశించారు. సోమశిల ప్రాజెక్టుకు సంబంధించిన వరికుంటపాడు, దుత్తలూరు, సీతారామపురం మండలాల పరిధిలో గుర్తించిన ,1016 హెక్టార్లను అటవీ శాఖ అధికారులకు రెవెన్యూ శాఖ అధికారుల మ్యుటేషన్ పై కలెక్టర్ తో పరిశ్రమల శాఖ మంత్రి చరవాణి లో మాట్లాడారు. హైలెవల్ కెనాల్ ఫేజ్–2 పనులు, కాంట్రాక్ట్ ల ఆలస్యంపై మంత్రి అసంతృప్తి చెందారు. జూన్ 10 కల్లా గుత్తేదారులు పనులు మొదలు పెట్టకపోతే చివరిగా నోటీసులు పంపాలని మంత్రి ఆదేశించారు. మంత్రి మేకపాటి కార్యాలయంలో సోమశిల ప్రాజెక్టుపై మంత్రి గౌతమ్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమశిల ప్రాజెక్టు పరిధిలోని కాలువల అభివృద్ధి పనుల వేగం పెంచేందుకు ఆదేశాలు జారీ చేశారు. రూ.117 కోట్ల విలువైన సోమశిల ప్రాజెక్టు మరమ్మతుల పనులు, సోమశిల ప్రాజెక్టు పరిధిలోని కాలువల అభివృద్ధి పనుల వేగం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. చాబోలు రిజర్వాయర్ పనులనూ వేగం పెంచాలని సూచించారు. ఉత్తర కాలువ పనుల విస్తరణ, పనుల వేగవంతానికి ఆదేశం, ఉత్తర కాలువ మీద 10వేల ఎకరాలకు రూ.50కోట్లతో లిఫ్ట్ లను పూర్తిచేయాలని మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. అటవీ, రెవెన్యూ, జలవనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ అనంతరం జాబితా సిద్ధం చేసి పంపాలని కలెక్టర్ కు మంత్రి మేకపాటి ఆదేశం. సోమశిల ప్రాజెక్టుపై సమీక్షలో ఎస్.ఈ కృష్ణారావు, తెలుగుగంగ సీ.ఈ హరనాథ్ రెడ్డి, సోమశిల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వెంకటరమణారెడ్డి, సురేష్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్ లో చికిత్స పొందుతూ రిటైర్డ్ హెడ్ మాస్టర్ కోటయ్య మృతి

నెల్లూరు ఆనందయ్య మందు తీసుకున్న తర్వాత కోలుకుంటున్నట్లుగా చెప్పిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ కోటయ్య కన్నుమూశారు. గతంలో సామాజిక మాధ్యమాల్లో కోటయ్య వీడియోలు హల్చల్ చేశాయి. అయితే ఆనందయ్య వైద్యాన్ని తప్పుగా నిరూపించడం కోసం కూడా ప్రయత్నాలు జరిగాయి. తాజాగా ఆయన జీజీహెచ్లో చికిత్స పొందుతూ మరణించారు. కృష్ణపట్నంలో ఆనందయ్య ఇచ్చే కరోనా మందు తీసుకున్న హెడ్ మాస్టర్ కోటయ్య ఆరోగ్యం కొద్ది రోజుల క్రితం మరోసారి క్షీణించింది. ఆనందయ్య మందుతో కోటయ్య ఆక్సిజన్ లెవల్స్ పెరిగాయని ప్రచారం జరిగింది. అయితే, అనంతరం కోటయ్య ఆక్సిజన్ లెవల్స్ పడిపోవడంతో కుటుంబసభ్యులు ఆయనను ఆసుపత్రికి తరలించారు. గతంలో దాదాపు మరణం అంచులకు వెళ్లి ఆనందయ్య మందుతో తిరిగి వచ్చానని కోటయ్య చెప్పిన వీడియో వైరల్ అయ్యింది. "ఊపిరి అందడంలేదు. కొన ఊపిరితో ఉన్న.. ఇంకా రెండు నిముషాలు ఆగితే, ఆక్సిజన్ లేకపోతే చనిపోతా.. దీంతో వెంటనే మావాళ్లు వచ్చి వెంటనే కంటిలో మందు వేశారు. 10, 15 నిముషాల్లో కోలుకున్నానని, ఈ మందు చాలా అద్భుతమని గతంలో కోటయ్య తెలిపారు. అయితే, ఆయన చికిత్స పొందుతూ చనిపోవడంతో ఆనందయ్య మందుపై సందేహాలు నెలకొన్నాయి.





# కోవిడ్ పేషెంట్లూ.. అప్పుడే సర్జరీల జోలికి వెళ్లకండి: ఐసీఎంఆర్



న్యూఢిల్లీ: కరోనా నుంచి కోలుకున్న వాళ్లు వెంటనే సర్జరీలు చేయించుకోకూడదని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) సూచించింది. అత్యవసరం కాని సర్జరీలను కొవిడ్ నుంచి కోలుకున్న 6 వారాల తర్వాతే చేయించుకోవాలని స్పష్టం చేసింది. ఇలా చేయడం వల్ల త్వరగా కోలుకుంటారని చెప్పింది. ఇక ఇలాంటి పేషెంట్లు సర్జరీకి ముందు చేసుకునే ఆర్టీ–పీసీఆర్ టెస్టుల్లో పాజిటివ్‌గా తేలినా కంగారు పడాల్సిన అవసరం లేదని, శరీరంలో మిగిలిపోయిన హాని చేయని చనిపోయిన వైరస్ కారణంగా ఇలా టెస్టులు పాజిటివ్‌గా వస్తాయని ఐసీఎంఆర్ తెలిపింది. కొవిడ్ రీఇన్ఫెక్షన్ కనీసం 102 రోజుల తర్వాతే నిర్ధారణ అవుతుందని, అందువల్ల ఇలాంటి సర్జరీలను వాయిదా వేయడమే మంచిదని అంటు వ్యాధుల నిపుణులు డాక్టర్ సంజయ్ పూజారి చెప్పారు. అయితే అత్యవసర సర్జరీలను మాత్రం అన్ని ముందు జాగ్రత్తలతో వెంటనే నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. అయితే కొవిడ్ పేషెంట్లకు సర్జరీ చేసే ముందు వారి గుండె, ఊపిరితిత్తుల పనితీరును పరిశీలించాలని సూచించారు. కొవిడ్ నుంచి కోలుకున్న తర్వాత కూడా కొంతమందిలో 60 రోజుల వరకూ కూడా అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, ఛాతీ నొప్పి వంటి లక్షణాలు ఉంటాయని డాక్టర్ పూజారి చెప్పారు. అందువల్ల ఇలాంటి వారికి సర్జరీలు చేసే ముందు అన్ని రకాలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అసలు 102 రోజుల వరకూ కూడా కొవిడ్ నుంచి కోలుకున్న వారిని తిరిగి టెస్టు చేయడం అనేది సమయం వృథా చేయడవే అవుతుందని పలువురు డాక్టర్లు అభిప్రాయపడుతున్నారు.

## జూన్ 19 నుంచి 27వ తేదీ వరకుఅప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి, మే 31అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు జూన్ 19 నుంచి 27వ తేదీ వరకు జరుగనున్నాయి. కోవిడ్–19 వ్యాప్తి నేపథ్యంలో ఈ ఉత్సవాలను ఆలయ ప్రాంగణంలో ఏకాంతంగా నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జూన్ 15న ఉదయం 8.30 నుండి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. జూన్ 18వ తేదీ సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహించనున్నారు. జూన్ 19న ఉదయం 10.45 నుంచి 11.15 గంటల మధ్య ధ్వజారోహణం జరుగనుంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 8 నుండి 9 గంటల వరకు, సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో తిరుచ్చి ఉత్సవం, ఆస్థానం నిర్వహిస్తారు. జూన్ 22న సాయంత్రం 4 నుండి 6.30 గంటల వరకు శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవం ఏకాంతంగా నిర్వహిస్తారు. జూన్ 27న ఉదయం 8.30 నుండి 10 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులతో పాటు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం జరుగనుంది.

## ముగిసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వసంతోత్సవాలు

తిరుపతి మే 31 శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన వసంతోత్సవాలు సోమవారం ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 1.30 నుండి 3.30 గంటల వరకు శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి, శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి, రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. అనంతరం ఆస్థానం నిర్వహించారు.

# కర్నూల్ పశ్చిమ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులను వెంటనే నిర్మించాలి

కౌతాళం ( విభారె) మండల పరిధిలోని బల్లేకల్లు గ్రామంలో సోమవారం సచివాలయం దగ్గర ఆర్ సి సి రాష్ట్ర ఉపద్యక్షుడు లోకేష్ మరియు గ్రామ రాయలసీమ యువజన వేదిక నాయకులు రవి,రామంజి, అనిల్,వీరేశ్ మాట్లాడుతూ సిద్దేశ్వరం అలుగు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, అలాగే కర్నూల్ పశ్చిమ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రాజెక్టులను వెంటనే చేపట్టాలి అని సచివాలయం ఉద్యోగులకు వినతిపత్రం సమర్పించారు.అందులో భాగంగా మాట్లాడుతూ గౌరవనీయులు మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ .గౌ.శ్రీ.రాజశేఖర్ రెడ్డి గారు జలయజ్ఞం మొదలు పెట్టారు అలాగే తండ్రికి తగ్గ తనయుడు మన ప్రియతమ ముఖ్యమంత్రి గౌ.శ్రీ వై.యస్.జగన్మోహన్ రెడ్డి గారు తండ్రికి తగ్గ తనయుడుగా జనంలో పేరు పొందడం ఎంతో సంతోషకరమైన విషయం కానీ ఇక్కడ కర్నూల్ పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఖీఆూ కుడి కాలువ అలాగే వేదవతి ప్రాజెక్ట్ పూర్తి నిర్మానంతో చేపట్టాలి అని కోరుతున్నాము అని చేస్తారు అని నమ్మకం కూడా మాకు నమ్మకం ఉంది అని చెబుతూ ఇంకా పులికనుమ ప్రాజెక్ట్ ఇప్పుడు 3టీఎంసీ లు ఉన్నదాన్ని 5 టీఎంసీలు గా పెంచాలని ,అలాగే మేలిగనూరు దగ్గర తుంగభద్రలో 150 టీఎంసీ లు వృధాగా పోతున్నాయి అని అక్కడ వరద కాలువ ప్రాజెక్టుని చేపడితే ఇక్కడ ఉన్న 38 గ్రామాలకు నీరు అందుతుంది అని మిమ్మల్ని నిజమైన శ్రీకృష్ణ దేవరాయలు గా గుర్తు పెట్టుకుని పూజిస్తారు అని మీరు ఒక్క సారి ఆలోచన చేసి మాకు న్యాయం చేసి ఇక్కడ ఉన్న వలసలను సుగ్గిని తగ్గిస్తారు అని కోరుకుంటున్నాము అని చెప్పుకొచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నిరుపేదల ఆకలి తీర్చడానికి ముందు ఉంటాము సీపీఐ

నంద్యాల ( విభారె) కరోనా కష్టకాలంలో నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ పోస్ట్ ఆఫీస్ శ్యామ కాలువ ప్రాంతాలలో సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో నిరుపేదలకు భోజనాలు పంపిణీ చేయడం జరిగిందని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ తెలిపారు. పేదల ఆకలి తీర్చడానికి మా పార్టీ ముందు ఉంటామని అన్నారు. మూడవరోజు భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కరీమ్ఖాన్ సహకారంతో సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో భోజనాల పంపిణీ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షులు డి శ్రీనివాసులు రైతు సంఘం కార్యదర్శి జి సోమన్న వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఏ సుబ్బరాయుడు పాల్గొన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో పేదలు అన్నమో రామచంద్రా అని అలమటిస్తున్నారని ఆయన అన్నారు. పట్టణ ప్రజలు కరోనా మహమ్మారి వల్ల వ్యాపార వాణిజ్య సముదాయాలు కుదేలు అయ్యి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కష్టాలను అర్థం చేసుకుని వారిని ఆదుకోవాలని అన్నారు. అదేవిధంగా మన నంద్యాల పట్టణంలో చాలామంది ధనికులు ఉన్నారని అటువంటి వారు ఒక్కొక్కరు పేదలకు ఒక పూట భోజనం ఏర్పాటు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఆదోని ప్రాంతానికి మెడికల్ వైద్య కళాశాలతో మహర్దశ

## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ఆదోని( విభారె) డివిజన్ పరిధిలో ఆదోని వయా ఎమ్మిగనూరు జాతీయ రహదారి పక్కన ఆరెకల్ గ్రామ సమీపం వద్ద 58.44 ఎకరాల విస్తీర్ణంలో రూ. 475 కోట్లతో అత్యాధునిక వసతులతో నిర్మించబోతున్న మెడికల్ కళాశాల నిర్మాణంతో అత్యంత వెనుకబడిన నియోజకవర్గాలు అయినా ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ ప్రజల కల సాకారం అవుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు.సోమవారం ఆదోని మెడికల్ కాలేజ్ సంబంధించి ఫైలన్ స్టోన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన ఆరు దశాబ్దాల కాలంలో 11 వైద్య కళాశాలల ఏర్పాటైతే జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రెండేళ్ల కాలంలోనే వైద్య రంగానికి పెద్దపీట వేస్తూ పేదలందరికీ మెరుగైన వైద్య సదుపాయం కోసం 16 మెడికల్ కాలేజీలు మంజూరు చేసి ఒకే సారి ఇన్ని వైద్య కళాశాలలను నిర్మించేందుకు శ్రీకారం చుట్టడం దేశంలోనే అరుదైన రికార్డుగా నిలిచిపోతుందన్నారు. దీంతో 5 కోట్ల ప్రజానీకం తరపున రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నాను అన్నారు. ఇప్పటికే పులివెందుల, పాడేరు వైద్య కళాశాలల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు.నేడు వర్చువల్ పద్దతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి 14 మెడికల్ కాలేజ్ ల నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన చేశారన్నారు. ఆదోనిలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడంతో ఆదోని వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆదోని ప్రాంత వాసులు అనారోగ్యానికి గురైతే బళ్లారి, బెంగుళూరు ప్రాంతాలకు వెళ్లి వైద్య చికిత్సలు చేయించుకునే వారిని, ఆదోనిలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో ఆదోని ప్రజల కల నెరవేరిందిని, ఆదోని డివిజన్ అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి వైద్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి కలెక్టర్ రామ సుందర్ రెడ్డి, ఆర్ డి ఓ రాంచందర్ రెడ్డి డిఎస్పి వినోద్ కుమార్ ప్రజా ప్రతినిధులు అధికార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి....

## సైబరాబాద్ సీపీ సజ్జనార్..

శేరిలింగంపల్లి ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ను పురస్కరించుకుని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో కొత్తపల్లి కోటేశ్వరరావు సౌజన్యం తో ముద్రించిన గోడ పత్రిక ( స్టిక్కర్ ) ను సోమవారం నాడు సైబరాబాద్ కమిషనరేట్ లో సైబరాబాద్ పోలీస్ కమిషనర్, ఏడిజిపి విసి సజ్జనార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు , పొగాకు ఉత్పత్తులు (చుట్ట, బీడీ , సిగరెట్ , గుట్కా మొదలగునవి) వినియోగించడం వలన శ్వాసకోశ వ్యాధులు , గుండె సంభధిత వ్యాధులు , ఓరల్ క్యాన్సర్ , లంగ్ కాన్సర్ లాంటి వ్యాధులకు గురై ప్రపంచవ్యాప్తంగా 10 మిలియన్ల మంది ప్రజలు మృత్యువాత పడుతున్నారు. పొగాకు , పొగాకు ఉత్పత్తులు వినియోగించడం వలన జరిగే అనర్థాలు ఆస్థినష్టం , ప్రాణనష్టం నివారించటానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ( చిఊూ ) వారు ప్రజల్లో అవగాహన పెంచటానికి ప్రపంచవ్యాప్తంగా 1987 నుంచి ఈ దినోత్సవంను నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఒక థీమ్ తోటి నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం ( 2021) థీమ్ "పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగంనుండి నిష్క్రమించటానికి కట్టుబడి ఉండండి" అనే నినాదంతో ఈ కార్యక్రమం చిఊూ వారు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగానే ఈ కార్యక్రమం అని అన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన చైనా, ఇండియా లోనే పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగదారులు అధికంగా ఉన్నారు అని అన్నారు. వీటి వినియోగం వలన మానవుడు జీవిత కాలం కూడా తగ్గిపోతున్నది . వ్యాధి నిరోధక శక్తి తగ్గి కరోనా వంటి వ్యాధులు కూడా రావడానికి ఎక్కువగా అవకాశాలు ఉన్నవి అన్నారు. కాన్సర్ వ్యాధిగ్రస్తులలో 30 శాతం మంది పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగం వలనే అని సర్వేలు చెబుతున్నాయి అని అన్నారు.ఇటీవల కాలంలో సమాజంలో వస్తున్న మార్పుల (పబ్ కల్చర్ , రేవ్ పార్టీలు ) కారణంగా యువతి , యువకులు అల్కాహాల్ , పొగాకు, పొగాకు ఉత్పత్తులు , ఎలక్ట్రానిక్ సిగరెట్లు , మాదాకద్రవ్యాలు ( హెరాయిన్ , గంజాయి) వినియోగం అధికమవటం వలన ఆర్థికంగా నష్టపోవటమే కాకుండా మృత్యువాత పడుతున్నారు అన్నారు. వీటి నివారణకై ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు , పౌరసమాజం వీటి వినియోగంనుంచి ప్రజలను ముఖ్యంగా యువతను చేతన్య పరచాలని కోరారు. ఆరోగ్యమే మహాభాగ్యం కావున అందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తాడిబోయిన రామస్వామి యాదవ్ , కొత్తపల్లి కోటేశ్వరరావు , రామ్మోహనరావు , పాలం శ్రీను , జనార్ధన్ , విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించిన బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ

కౌతాళం ( విభారె) ఈరోజు కౌతాళం మండల కేంద్రంలోని వంద మంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పురుషోత్తంరెడ్డి మరియు బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ పాల్గొని వీరి చేతుల మీదుగా వంద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది పురుషోత్తమ రెడ్డి మరియు రామకృష్ణ మాట్లాడుతూ ఈ కరొన కష్టకాలంలో ఎన్నో కుటుంబాలు ఆకలిచావులతో అలమటిస్తూ ఉన్నాయని మా వంతు సహాయంగా కొన్ని నిరుపేద కుటుంబాలకు ఇలా నిత్యావసర సరుకులు ఇవ్వడం సంతోషంగా ఉందని పోయిన సంవత్సరం కరోన సమయంలో కూడా ప్రజలకు నిత్యావసర సరుకులు మరియు ప్రజలకు ఏవైతే అవసరమైతే వాటన్నింటిని కూడా ఇవ్వడం జరిగిందని ఆయన అన్నారు.నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందిస్తున్నామని పురుషోత్తమ రెడ్డి అన్నారు.అదేవిధంగా ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఏమి అవసరమైన సరే మమ్మల్ని సంప్రదిస్తే మా వంతు సహాయం చేస్తామని పురుషోత్తమ రెడ్డి మరియు రామకృష్ణ అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ మరియు మండల అధ్యక్షులు వెంకన్న ,రామచంద్ర,అబ్రహాం ,నాగిరెడ్డి ,లంక చంద్రకాంత్రెడ్డి,మారుతి, చిరుతపల్లి ఈరన్న, కామవరం వెంకట్రెడ్డి ,గుడి కంబళి శ్రీనివాసులు,మరియు వివిధ గ్రామాల బిజెపి నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# పురిటి బిడ్డలకు దోమ తెరల గొడుగులు - తల్లులకు బిస్కెట్లు పండ్లు పంపిణీ

నెల్లూరు ( విభారె) భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ 7సంవత్సరాల పరిపాలన విజయవంతాడుని పురస్కరించుకుని, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో పురిటి బిడ్డలకు దోమతెరల గొడుగులు, తల్లులకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని బిజెపి మహిళా మోర్చా జిల్లా శాఖ నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వానికి 2వ సారి పరిపాలన లో భాగంగా,2 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, దేశమంతా 5 లక్షల పైగా గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే బిజెపి జాతీయ అధ్యక్షుడు జె. పి. నడ్డా రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు , ఉపాధ్యక్షుడు. సురేంద్ర రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షులు నిర్మలా కిషోర్ మరియు జిల్లా అధ్యక్షుడు జి.భరత్ కుమార్ పిలుపు మేరకు, మహిళా మోర్చా జిల్లాఅధ్యక్షురాలు రాజేశ్వరి కందికట్ల అధ్యక్షతన , నెల్లూరు జిల్లా ఉపద్యక్షురాళ్లు కరణం సుభాషిణి, శఘంటా విజయశ్రీ ధ్వర్యంలోప్రభుత్వ ఆసుపత్రిలో తల్లీ, బిడ్డ సంరక్షణాలయం లో పుట్టిన బిడ్డలకు దోమతెరలు, పురిటి తల్లులకు బిస్కెట్లు పండ్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉంది అన్న.ప్రభుత్వ ఆసుపత్రి ఓ పి. విభాగం మందు రోగుల సహాయకులకు అల్పాహారంన్నీ, మరియు పండ్లనుఅందిం చారు.సేవా హి సంఘటన్ సేవా కార్యక్రమాలు మహిళా మోర్చా నెల్లూరు జిల్లా వారి ఆధ్వర్యంలో మధ్యాహ్నం బోజనాలను కూడా అందించారు. ఈ 3 కార్యక్రమాల్లో నెల్లూరు జిల్లా మహిళా మోర్చా ఉపద్యక్షురాళ్లు. కె.సుభాషిణి,జి. విజయశ్రీ మరియు బుజ్జమ్మ, సంపూర్ణ, శీనయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు వారి పాట ఫ్యాన్స్ మాస్ చర్చ




సూపర్ స్టార్ మహేష్ బాబు రెగ్యులర్ గా ఒకే తరహా సినిమాలు చేస్తున్నాడు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్న సమయంలో ఆయన నుండి రాబోతున్న సర్కారు వారి పాట సినిమా వారికి గట్టి సమాధానం ఇస్తుందంటూ అభిమానులు చాలా నమ్మకంగా ఉన్నారు. పరశురామ్ దర్శకత్వంలో మహేష్ బాబు చేస్తున్న ఈ సినిమా కరోనా కారణంగా షూటింగ్ కాస్త ఆలస్యం అవుతున్నా కూడా అనుకున్న తేదీకి అంటే వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల మాత్రం పక్కా అన్నట్లుగా చిత్ర యూనిట్ సభ్యులు చెబుతున్నారు.ఈ సమయంలోనే ఈ సినిమా గురించిన ఇంట్రెస్టింగ్ పాయింట్ ఒకటి అభిమానుల్లో తెగ చర్చ జరుగుతోంది. అభిమానుల్లో జరుగుతున్న చర్చ మేరకు సర్కారు వారి పాట సినిమాలోని మహేష్ బాబు డైలాగ్స్ అది కూడా మాస్ డైలాగ్స్ సినిమా స్థాయిని అమాంతం పెంచే విధంగా ఉంటాయట. గతంలో మాదిరిగా కాకుండా మహేష్ బాబు డైలాగ్స్ ప్రత్యేకంగా ఈ సినిమా లో ఉంటాయంటూ యూనిట్ సభ్యులు అనధికారికంగా చెబుతున్నారు. దాంతో అభిమానులు మాస్ డైలాగ్స్ చర్చతో ఊగిపోతున్నారు.సర్కారు వారి పాట సినిమా చాలా ప్రత్యేకంగా ఉంటుందని ఎంటర్ టైన్ మెంట్ తో పాటు ఒక ఒక స్ట్రాంగ్ మెసేజ్ ను కూడా ఇవ్వబోతున్నట్లుగా చెబుతున్నారు. మహేష్ బాబుకు జోడీగా కీర్తి సురేష్ ఈ సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. గీత గోవిందం వంటి సూపర్ హిట్ తర్వాత పరశురామ్ తెరకెక్కిస్తున్న సినిమా ఇదే కావడంతో అంచనాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. మొత్తానికి సర్కారు వారి పాట మహేష్ బాబు అభిమానులతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను కూడా ఆసక్తిగా ఎదురు చూసేలా చేసింది.

# బాలచందర్ పారితోషికం 5 లక్షలు దాటలేదట!




తెలుగు .. తమిళ భాషల్లో సీనియర్ డైరెక్టర్ గా కేఎస్ రవికుమార్ కి మంచి క్రేజ్ ఉంది. మాస్ అంశాలు కాస్త ఎక్కువగా కనిపించినప్పటికీ యూత్ ను .. ఫ్యామిలీ ఆడియన్స్ ను థియేటర్ కి రప్పించే కథలనే ఆయన ఎంచుకుంటూ ఉంటాడు. తమిళంలో రజనీకాంత్ తో చేసిన 'ముత్తు' .. 'నరసింహ' సినిమాలు సంచలనం విజయాన్ని సాధించగా కమల్ తో తెరకెక్కించిన 'దశావతారం' ప్రేక్షకులను విస్మయులను చేసింది. తాజా ఇంటర్వ్యూలో ఆయన అనేక విషయాలను గురించి ప్రస్తావించారు."రజనీకాంత్ కథానాయకుడిగా ఆయనతో నేను చేసిన తొలి చిత్రం 'ముత్తు'. ఆ సినిమాకి కె. బాలచందర్ గారు నిర్మాత. ఒక గొప్ప దర్శకులు నిర్మించిన సినిమాకి నేను దర్శకత్వం వహించడం నా భాగ్యంగా భావిస్తూ ఉంటాను. 'ముత్తు' కథ ఆయనకి చెప్పినప్పుడు వెంటనే ఓకే అన్నారు. "ఇది నా సినిమాలా ఉండకూడదు .. రజనీకాంత్ సినిమాల ఉండాలి" అని చెప్పారు. పారితోషికం ఎంత తీసుకుంటున్నావ్? అని అడిగారు. రజనీకాంత్ గారిని అడిగి ఇవ్వండి సార్ అన్నాను. ఆయన రజనీకాంత్ గారికి కాల్ చేసి అడిగితే ఓ 15 లక్షలు ఇవ్వండి అని ఆయన చెప్పారు.ఆ మాట వినగానే బాలచందర్ గారు షాక్ అవుతూ ఫోన్ పెట్టేశారు. "15 లక్షలు ఏంట్రా .. నేను ఎన్నో సినిమాలు చేస్తూ వచ్చాను .. నా పారితోషికం 5 లక్షలు కూడా దాటలేదు. రజనీకాంత్ చెప్పాడు కనుక నేను ఇవ్వాలి .. కానీ డైరెక్టర్ పారితోషికమే 15 లక్షలంటే ఎలారా? నేను ఇప్పుడే వింటున్నాను" అని నాతో అన్నారు. ఆయన ఆ మాట అనగానే నాకు చాలా బాధ అనిపించింది. బాలచందర్ గారు ఎంత పెద్ద డైరెక్టర్ .. ఎన్ని గొప్ప సినిమాలు ఇచ్చారు .. అయినా ఆయన పారితోషికం 5 లక్షలు దాటలేదని తెలిసినప్పుడు నిజంగా నేను చాలా ఫీలయ్యాను" అని చెప్పుకొచ్చారు.

# దర్శకుల సామర్థ్యాన్ని నమ్మి ముందుకెళ్తున్న స్టార్ హీరోలు..!

ప్రస్తుతం టాలీవుడ్ స్టార్ హీరోలందరూ వరుస పెట్టి సినిమాలు ప్రకటిస్తున్నారు. ఒక సినిమా సెట్స్ పై ఉండగానే మరికొన్ని ప్రాజెక్ట్స్ లైన్ లో పెడుతున్నారు. ప్రస్తుతం కరోనా సెకండ్ వేవ్ కారణంగా ఇంటికే పరిమితమైన హీరోలు కొత్త కథలను వింటుంటే.. స్టార్ డైరెక్టర్స్ కొత్త స్క్రిప్టులతో హీరోలను మెప్పించే పనిలో ఉన్నారు. ప్రెజెంట్ వాళ్ళు డైరెక్ట్ చేస్తున్న సినిమాలు రిలీజ్ అవ్వకపోయినా.. దర్శకుల ప్రీవియస్ సినిమాల రిజల్ట్స్ ని దృష్టిలో పెట్టుకొని స్టార్ హీరోలు సినిమాలకు సైన్ చేస్తున్నారు.దర్శకధీరుడు రాజమౌళి ప్రస్తుతం 'ఆర్.ఆర్.ఆర్' సినిమా తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమా సెట్స్ పై ఉండగానే జక్కన్న తో సూపర్ స్టార్ మహేష్ బాబు ఓ సినిమా చేయడానికి రెడీ అయ్యారు. అలానే త్రివిక్రమ్ శ్రీనివాస్ మీద నమ్మకంతో కంప్లీట్ స్క్రిప్టు వినకుండానే మహేష్ సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. 'కేజీఎఫ్ 2' రిలీజ్ కాకముందే డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తో యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ 'సలార్' సినిమా మొదలుపెట్టేసాడు.

# కరోనాకు ప్రమాదకరమైన కొత్త లక్షణం ... ఈ లక్షణం ఉంటే వారిని కాపాడటం కష్టం అవుతుంది ...!




కరోనా వైరస్ యొక్క రెండవ వేవ్ ఊూఎఐ-19 రోగులలో అనేక సమస్యలను రేకెత్తించింది మరియు దానితో చాలా తీవ్రమైన లక్షణాలను తీసుకువచ్చింది. వాటిలో ఒకటి గ్యాంగ్రేన్ అని పిలువబడే కండరాల నొప్పి, ఇది రోగులలో తీవ్రమైన ఊూఎఐ-19 సంక్రమణకు లక్షణంగా ఉంటుంది. ఢిల్లీలోని వైద్యుల ప్రకారం, చర్మ కణజాల సంక్రమణ గ్యాంగ్రేన్ కూడా ఊూఎఐ-19 యొక్క లక్షణం కావచ్చు. వైద్యులు చెబుతున్నది ఏమిటంటే, కొందరు ఊూఎఐ-19 రోగులు కొన్ని ఇతర లక్షణాల ముందు క్రమం తప్పకుండా శ్వాస సంకేతాలు మరియు లక్షణాలను అనుభవించవచ్చు. గ్యాంగ్రేన్ ఒక ప్రధాన ప్రమాద కారకం మాత్రమే కాదు, నిపుణులు ఇప్పుడు ఊూఎఐ-19 మరియు గ్యాంగ్రేన్ మధ్య సంబంధం నల్ల ఫంగస్ సంక్రమణ కనిపించినంత ప్రమాదకరంగా ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రమాదం గురించి ఏమి కనుగొనబడింది? ఈ ప్రమాదం గురించి ఏమి కనుగొనబడింది? ఊూఎఐ యొక్క సాధారణ ఎగువ-శ్వాసకోశ లక్షణాలను చూపించే ముందు 65 ఏళ్ల రోగికి సానుకూల పరీక్షలో గ్యాంగ్రేన్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. కరోనా ముఖ్యమైన లక్షణాలు కనిపించడానికి ముందు సున్నా కొమొర్బిడిటీలను కలిగి ఉన్న 65 ఏళ్ల, తన కాళ్ళ దగ్గర బలహీనత మరియు త్రంబోటిక్ నొప్పి గురించి ఫిర్యాదు చేశాడు. అతను ఎడెమా, దడ మరియు రంగు పాలిపోవటం కోసం పరీక్షించబడ్డాడు. ఊూఎఐ-19 తో రద్దీ ప్రమాదం సాధారణం కంటే తీవ్రంగా ఉందని వైద్యులు నమ్మడానికి లక్షణాల మెరుగుదల ఒక కారణం కావచ్చు. నల్ల ఫంగస్, తెలుపు ఫంగస్, పసుపు ఫంగస్; ఇది అత్యంత ప్రమాదకరమైనది మరియు తీవ్రమైనదినల్ల ఫంగస్, తెలుపు ఫంగస్, పసుపు ఫంగస్; ఇది అత్యంత ప్రమాదకరమైనది మరియు తీవ్రమైనది సమాజం అంటే ఏమిటి? సమాజం అంటే ఏమిటి? సరైన రక్త సరఫరా లేకపోవడం వల్ల చర్మ కణజాలం చనిపోయే స్థితిని గ్యాంగ్రేన్ సూచిస్తుంది (ఇది అనేక కారణాల వల్ల సంభవించవచ్చు). కణజాల నష్టం తరచుగా చర్మం అంచులలో సంభవిస్తుంది మరియు తరచుగా కాలి, వేళ్లు, అవయవాలు, కండరాల కణజాలం మరియు ముఖ్యమైన అవయవాలను ప్రభావితం చేస్తుంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న మరియు అంటుకొనే సంక్రమణ వలన సమాజం సంభవిస్తుంది, దీనికి తక్షణ సంరక్షణ మరియు యాంటీబయాటిక్ చికిత్స అవసరం. గర్భనిరోధక మాత్రను నిలిపివేసినప్పుడు కనిపించే దుష్ప్రభావాలు..గర్భనిరోధక మాత్రను నిలిపివేసినప్పుడు కనిపించే దుష్ప్రభావాలు.. ఊూఎఐ-19 చర్మ లక్షణాలకు కారణమవుతుందా? ఊూఎఐ-19 చర్మ లక్షణాలకు కారణమవుతుందా? ఊూఎఐ-19 వ్యాప్తితో బాధపడుతున్న చర్మ సంక్రమణ లేదా లక్షణం సమాజం మాత్రమే కాదు. ఊూఎఐ-19 ముఖ్యమైన అవయవాలను ఎలా లోతుగా ప్రభావితం చేస్తుందో చాలా కాలంగా అన్వేషించబడింది మరియు వైరస్ వ్యక్తీకరణలు చర్మంలో అనుభూతి చెందుతాయి మరియు రక్తప్రవాహాన్ని ప్రభావితం చేస్తాయి, దీని వలన ఉపరితల-స్థాయి మంట వస్తుంది. సోరియాసిస్, ఉర్టికేరియా (దద్దుర్లు), బాధాకరమైన బొబ్బలు మరియు పొడి చర్మం వంటి చర్మ లక్షణాలను ఆశించండి. ఊూఎఐ గోర్లు మరియు కాలి కూడా లక్షణాల గురించి చాలా మాట్లాడతారు. గ్యాంగ్రేన్కు మరో ప్రమాద కారకం ఏమిటంటే, కరోనా రోగులలో ఈ లక్షణం తీవ్రంగా ఉన్నప్పుడు అది చాలా మందికి వేగంగా వ్యాపించే అవకాశం ఉంది. కరోనా కొత్త లక్షణం: కండరాలనొప్పి, వెన్ను నొప్పి అని తెలుసా..?కరోనా కొత్త లక్షణం: కండరాలనొప్పి, వెన్ను నొప్పి అని తెలుసా..? రద్దీని ప్రమాదకరమైన లక్షణంగా ఎందుకు భావిస్తారు? రద్దీని ప్రమాదకరమైన లక్షణంగా ఎందుకు భావిస్తారు? ఇతర ప్రభుత్వ లక్షణాల మాదిరిగా కాకుండా, గ్యాంగ్రేన్ పర్యవేక్షణ లేదా పురోగతి సంక్రమణకు తీవ్రమైన సంకేతం మరియు తక్షణ సహాయం అవసరం. ఇది ప్రధానంగా రక్తం, గడ్డకట్టడం మరియు అంతర్లీన పరిస్థితులపై రాంఖీూ-ఊూ-2 ప్రభావం వల్ల కావచ్చు. దీనిపై మరిన్ని పరిశోధనలు జరుగుతున్నందున, తీవ్రమైన రక్తం గడ్డకట్టడం వల్ల గ్యాంగ్రేన్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని వైద్యులు భావిస్తున్నారు. ఎవరు ప్రమాదంలో ఉన్నారు? ఎవరు ప్రమాదంలో ఉన్నారు? గ్యాంగ్రేన్ అభివృద్ధి చెందడానికి అనేక ప్రమాద కారకాలు ఉన్నాయి

# సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కుటుంబాన్ని కలిసిన వార్నర్

ఆస్ట్రేలియా(కాన్బెర్రా): నెల రోజుల సుదీర్ఘ నిరీక్షణ తరువాత ఆస్ట్రేలియా క్రికెటర్ డెవిడ్ వార్నర్ సోమవారం తన కుటుంబాన్ని కలిశాడు. దీనికి సంబంధించిన ఫోటోలను వార్నర్ భార్య కాండిస్ వార్నర్ ఇన్స్టాగ్రామ్లో పోస్ట్ చేయగా..ప్రస్తుతం అవి వైరల్గా మారాయి. కాగా కోవిడ్-19 కారణంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2021 వాయిదా పడిన సంగతి తెలిసిందే. దీంతో విదేశీ ఆటగాళ్లు తమ దేశాలకు పయనమయ్యారు. అయితే ఆస్ట్రేయాలో ప్రయాణాలపై నిషేధం కారణంగా ఆ దేశానికి చెందిన క్రికెటర్ డేవిడ్ వార్నర్ తమ దేశ ఆటగాళ్లతో కలిసి మాల్దీవులకు వెళ్లాల్సి వచ్చింది.

కాగా ఐపీఎల్ 2021లో ఏడు మ్యాచ్లు ఆడిన సన్ రైజర్స్ హైదరాబాద్ కేవలం ఒక్కటే మ్యాచ్ గెలిచి చివరి స్థానంలో ఉంది. దీంతో సన్ రైజర్స్ జట్టు యాజమాన్యం వార్నర్ను కెప్టెన్సీ నుంచి తప్పించి ఆ బాధ్యతలను కేన్ విలియమ్సన్కు అప్పగించింది. అంతేకాకుండా ఈ సీజన్లో మిగిన అన్ని మ్యాచ్లు గెలిస్తేనే సన్ రైజర్స్కు ప్లే ఆఫ్లో చోటు సంపాదించడానికి అవకాశం ఉంది. ఇక ఐపీఎల్-2021 సీజన్లో మిగిలిన మ్యాచ్లు యుఏఈలో జరుగుతాయని బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ ఇండియా (బీసీసీఐ) ధృవీకరించిన సంగతి తెలిసిందే. అయితే అంతర్జాతీయ క్యాలెండర్ బిజీ షెడ్యూల్ కారణంగా చాలా మంది విదేశీ ఆటగాళ్లు ఐపీఎల్లో పాల్గొనడంపై సందేహాలు నెలకొన్నాయి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**